


నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 234 • పేజీలు : 8 • శుక్రవారం 17 మే 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati


- ఎపి ఫలితాలతో దేశం షాక్ అవుతుంది..
- మళ్లీ విజయం వైకాపాదే అన్న జగన్
- గతం కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తున్నాం
- మరోసారి చరిత్ర సృష్టించబోతున్నాం..
- ఈసారి గతంలో కంటే ఎక్కువ సీట్లే గెలుస్తాం..
- ప్రశాంత్ కిషోర్ ఆలోచించలేనన్ని సీట్లు వస్తాయి..
- ప్రశాంత్ కిషోర్ చేసేది ఏమీ లేదు. అంతా టీమే చేస్తుంది..
- వచ్చే ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ప్రజలకు ఇంకా ఎక్కువ మేలు చేద్దాం..
- మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం
- ఐప్యాక్ ప్రతినిధులతో సరదా సమావేశంలో జగన్ వెల్లడి



# మళ్లీ విజయం మనదే

ఐప్యాక్ ప్రతినిధులతో భేటీ అయిన సీఎం జగన్

**విజయవాడ,మే 16 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని, మళ్లీ అధికారంలోకి రాబోతోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల ఫలితాలపై జగన్ స్పందించారు. మళ్లీ మనదే అధికారం అన్నారు. గురువారం మధ్యాహ్నం ఐప్యాక్ ప్రతినిధులతో భేటీ అయిన సీఎం జగన్ ఎన్నికల ఫలితాల్ని అంచనా వేశారు. మళ్లీ అధికారంలోకి వస్తున్నాం. మరోసారి చరిత్ర మిగతా 7లో

# ఎపిలో ఇసుక అక్రమ తవ్వకాలు..



- ఎన్జీటీ ఆదేశాలకు విరుద్ధంగా చర్యలు
- ఎపి ప్రభుత్వ తీరుపై సుప్రీం ఆగ్రహం
- ఇసుక అక్రమ తవ్వకాల నిరోధానికి కమిటీ
- తదుపరి విచారణ జూలై 15కు వాయిదా

**న్యూఢిల్లీ,మే 16 :** ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీం ఆదేశాలను సైతం పట్టించుకోకుండా యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలను సాగించిన ఏపీ ప్రభుత్వంపై సుప్రీం ధర్మాసనం మండిపడింది. అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశాలు మిగతా 7లో



## ఈ-ఆఫీస్ మూసివేతపై అనుమానాలు

- ఇప్పటికిప్పుడు ఈ ఆఫీస్ అప్ గ్రేడియేషన్ అవసరం లేదు
- ఈ-ఆఫీస్ మూసివేత వద్దంటూ గవర్నర్‌కు చంద్రబాబు లేఖ
- ఈ-ఆఫీస్ వ్యవహారంలో అక్రమాలు జరిగే అవకాశం ఉంది..

**అమరావతి,మే 16 (ఆంధ్రపత్రిక):** ఏపీలో ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓట్ల లెక్కింపు, ఫలితాలకు మరో మూడు వారాల సమయం ఉంది. ఇలాంటి సమయంలో వైసీపీ ఆపద్ధర్మ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. దీంతో వాటిని అడ్డుకునేందుకు మిగతా 7లో

## పివోకెపై పట్టు కోల్పోయేలా చేసారు..

\- నాటి కాంగ్రెస్ తప్పిదాలపై జైశంకర్ ఘాటు విమర్శలు



**న్యూఢిల్లీ,మే 16 :** ఒకరు చేసిన పొరబాటు కారణంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పై భారత్ తాత్కాలిక నియంత్రణ కోల్పోయిందని విదేశాంగ మంత్రి జై శంకర్ పేర్కొన్నారు. 'విశ్వబంధు భారత్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్‌పై తీవ్ర మిగతా 7లో

## నవీన్ నాయకత్వంలో వెనకబడ్డ ఒడిశా

\- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే



**భువనేశ్వర్,మే 16 :** బిజెపి, బిజెడిల వల్ల ఒడిశా అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. భువనేశ్వర్‌లో గురువారం ఖర్గే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ' ఒడిశాలో 24 ఏళ్లుగా నవీన్ పట్నాయక్ సిఎంగా మిగతా 7లో

## ముగ్గురు ఎస్పీలు,కలెక్టర్‌పై ఈసీ వేటు

మరికొందరిపైనా ఈసీ కొరడా




**న్యూఢిల్లీ,మే 16 :** ఏపీలో ఎన్నికల తర్వాత చోటు చేసుకున్న హింసపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఓవైపు భారీ ఓటింగ్ శాతంతో రాష్ట్రంలో ఓటర్లు తమ చైతన్యాన్ని చాటుకుంటే ఎన్నికల హింసతో రాజకీయ నేతలు, దాన్ని అరికట్టడంలో విఫలమై అధికారులు విమర్శలు మిగతా 7లో

## గొడవలు అరికట్టండి..

సీఎస్,డీజీపీ,సీఈవోకు హైకోర్టు కీలక ఆదేశాలు



**అమరావతి, మే 16 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసినా పలు జిల్లాల్లో అల్లర్లు, దాడులు కొనసాగుతున్నాయి. ఈ హింసాత్మక ఘటనలపై గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎన్నికల తర్వాత కూడా మిగతా 7లో

## పల్నాడులో పెట్రో బాంబుల కలకలం

- వైకాపా నేత ఇంట్లో 29 పెట్రోల్ బాంబులు గుర్తింపు



**పల్నాడు, మే 16 (ఆంధ్రపత్రిక):** పల్నాడులో పెట్రో బాంబుల కలకలం రేపాయి. వైకాపా నేత ఇంట్లో 29 పెట్రోల్ బాంబులు గుర్తించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మిగతా 7లో





## ఏపీలో హింసపై ఈసీ ఆగ్రహం

హింసాత్మక ఘటనలపై ఈసీకి డీజీపీ,సీఎస్ వివరణాత్మక నివేదిక

**అమరావతి,మే 16 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై ఏపీ సిఎస్ జవహర్‌రెడ్డి డిజిపి హరీష్ కుమార్ గుప్తాలు వివరణ ఇవ్వాలని ఈసీ ఢిల్లీకి వారిని పిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నేడు కేంద్ర ఎన్నికల సంఘం మిగతా 7లో

## జేసీ ఫ్యామిలీపై పోలీసులు కక్షసాధింపు!



- తాడిపత్రి టు హైదరాబాద్..
- జేసీ ఫ్యామిలీ తరలింపు..!!

**తాడిపత్రి,మే 16 (ఆంధ్రపత్రిక):** భారీ భద్రత మధ్య తాడిపత్రిలోని జేసీ దివాకర్ రెడ్డి ఫ్యామిలీని పోలీసులు హుటాహుటిన హైదరాబాద్ తరలించారు. జేసీ దివాకర్ రెడ్డి, మిగతా 7లో

## మహానాడు కార్యక్రమానికి బ్రేక్..

- ఎన్నికల ఫలితాల కారణంగా రద్దు
- యథావిధిగా గ్రామాల్లో రక్తదాన శిబిరాలు
- జెండా ఆవిష్కరణలు చేపట్టాలి:బాబు

**అమరావతి,మే 16 (ఆంధ్రపత్రిక):** ప్రతీ ఏటా పండుగలా జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమానికి ఈసారి కాస్త బ్రేక్ పడింది. అందుకు ఎన్నికల ఫలితాలే కారణం. ఈనెల మిగతా 7లో

## ముందే రానున్న నైరుతి రుతుపవనాలు



- మే 31న కేరళను తాకనున్న తొలకరి వానలు
- ఐఎండి ప్రకటనతో అన్నదాతల్లో ఆనందం..
- గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం..
- ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని అంచనా

**అమరావతి,మే 16 (ఆంధ్రపత్రిక):** మూడేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త అందజేసింది. ఈ ఏడాది జూన్ కన్నా ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉంది. మే 31నే నైరుతి రుతుపవనాలు మిగతా 7లో

## పథకాల లబ్దిదారులకు శుభవార్త



- లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ
- డిబిటి పథకాల కింద నిధులు విడుదల
- త్వరలోనే పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేస్తాం..

**అమరావతి, మే 16 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ముందు రాజకీయ దుమారానికి కారణమైన డీబీటీ పథకాల నిధుల విడుదల ప్రారంభమైంది. దీనికి మిగతా 7లో

## తెలంగాణలో పలుచోట్ల భారీ వర్షాలు

- నగరంలో ఉరుములతో దంచికొట్టిన వాన
- ఈదురుగాలులతో పలుచోట్ల విద్యుత్ అంతరాయం
- మరో ఐదు రోజులు తెలంగాణకు వర్షసూచన..



**హైదరాబాద్,మే 16 (ఆంధ్రపత్రిక):** తెలంగాణలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసాయి. హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం కురిసింది. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో భారీ వర్షం తో వాతా వరణం ఒక్కసారిగా మారిపోయింది. గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# భూతాపం ప్రతాపం

భూతాపం కారణంగా తీవ్రమైన కరువును ఎదుర్కోవాల్సిన దేశాలలో భారత్ కూడా ఉంది.రాబోయే 30 ఏళ్ళల్లో ఈ తీక్ష్ణత మరింతగా పెరుగుతూ ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.భారతదేశంలోని 50 శాతం మందిపై కరువు బరువు పడే సూచనలు కనిపిస్తున్నాయి.భూతాపం 3డిగ్రీల సెల్సియస్ పెరిగితే చాలు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని నివేదికలు చెబుతున్నాయి.1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగినా పరిణామాలు తీవ్రంగానే ఉండనున్నాయి.ముఖ్యంగా వ్యవసాయభూమి దాదాపు సగానికి పైగా కరువుక్షేత్రంగా మారిపోతుందని పరిశోధకులు చెబుతుంటే ఒళ్ళు గగుర్పొడుస్తోంది.ప్యారిస్ ఒప్పందంలో చెప్పినట్లుగా ఉష్ణోగ్రతలను పారిశ్రామిక యుగం నాటికి తీసుకురాగలిగితే చాలా వరకూ ముప్పును తప్పించుకోగలుగుతాం. ఆచరణలో అది జరిగేపనేనా? అన్నది పెద్దప్రశ్న.భూమి వేడెక్కిపోతోందిరా! బాబూఅంటూ శాస్త్రవేత్తలు నెత్తినోరు మొత్తుకుంటూనే ఉన్నారు. పర్యావరణ పరిరక్షణకై ఎప్పటి నుంచో ఎన్నో ఉద్యమాలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ వేదికలపై దేశాధినేతలు కలుసుకున్నప్పుడల్లా చర్చించే అంశాల్లో ఇదొకటి.ఉపన్యాసాలు, ఒప్పందాలు, నినాదాలు తప్ప అంతటా ఆచరణ శూన్యం.భూమి వేడెక్కిపోతున్న ప్రభావంతోశీతోష్ణస్థితుల్లో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఉష్ణోగ్రతలను కొలవడం ద్వారా దుష్ప్రభావాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. ఆ వివరాలను సంబంధిత విభాగాలు ప్రపంచానికి తెలియజేస్తూనే ఉన్నాయి.వాతావరణంలో మార్పులు చేర్పులు అన్నది అనాదిగా జరిగే పరిణామం.శీతోష్ణస్థితుల ప్రభావం ప్రపంచంపై, మానవుల మనుగడపై ఎంతో శక్తివంతంగా పనిచేస్తూ ఉంటుంది. ముఖ్యంగా,20 వ శతాబ్దం మధ్యకాలం నుంచీ ఉష్ణోగ్రతల్లో పెరుగుదల అసాధారణ స్థితికి చేరిపోయింది.ఈ ప్రభావంతో రుతువుల ప్రయాణం కూడా గతితప్పింది. అకాల వర్షాలు, ప్రకృతి భీభత్సాలు, కరువుకాటకాలు, వింత వింత జబ్బులు అన్నింటికీ భూమి వేడెక్కిపోవడమే ప్రధాన కారణం. పారిశ్రామికం వెర్రితలలు వేసి,ఆర్ధిక స్వార్ధం ప్రబలి, హరిత చైతన్యం అడుగంటడం వల్ల అనర్ధాలు జరుగుతున్నాయి.ఆరోగ్యకరమైన అభివృద్ధికి అవరోధాలు పెరుగుతున్నాయి.కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారమే కొంప ముంచుతోంది. భూమి వేడెక్కిపోవడం వల్ల ఏర్పడుతున్న పరిణామాలు విస్తృతంగా ఉంటాయి.సముద్ర మట్టాలు పెరిగిపోవడం, మహా సముద్రాల ఆమ్లీకరణం,అడవులు మండిపోవడం, అనేక జాతులు అంతరించిపోవడం, పంటల దిగుబడి తగ్గిపోవడం, ఆహారకొరత చుట్టుముట్టడం మొదలైన ఎన్నో దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి.సముద్ర తీర ప్రాంత వాసులు ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు కూడా తరలిపోవాల్సి వస్తుంది.భూతాపాన్ని అడ్డుకోవడం అందరి సమిష్టి బాధ్యత. ప్రభుత్వాలు, పారిశ్రామిక వర్గాలు, ప్రజలు అందరూ కలిసి రంగంలోకి దిగాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ దుస్థితికి కారణం మనిషి.మనిషిలోని స్వార్ధ చింతన, బాధ్యతా రాహిత్యం, రేపటి పట్ల ఏ మాత్రం స్పృహ లేకపోవడం ఈ దుస్థితికి చేర్చాయి. ఐక్య రాజ్య సమితి ఇటీవల నిర్వహించిన సమావేశంలోనూ ఈ అంశం బలంగా చర్చకు వచ్చింది. ఉద్గారాలను పెద్దఎత్తున తగ్గించాలి.భూతాపాన్ని 2 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువకు పరిమితం చేయాలని 2016లో పారిస్ లో ఒప్పందం జరిగింది. ఈ ఆరేడేళ్లలో అది తగ్గకపోగా మరింత పెరిగింది.భూమిని, వనరులను వాడుకొనే విధానంలోనెను అనారోగ్యకరమైన విధానాలు వచ్చాయి. నివాసయోగ్య భూమి -అటవీ భూమి మధ్య ఉన్న నిష్పత్తులు మారిపోయాయి. వ్యవసాయభూమిని వాడుకోవడంలోనూ మార్పులు వచ్చాయి. వ్యవసాయం కంటే మిగిలిన వాటికి ఆ భూమిని వాడే సంస్కృతి పెరిగిపోయింది.పర్యవసానంగా అటవీ భూమి, వ్యవసాయ భూమి తగ్గిపోయింది.కొన్ని రసాయనాల సమ్మేళనం మేఘాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి.భూమికి చేరే సూర్యకాంతి పరిమాణంలో కూడా తగ్గుదల మొదలైంది. దీనిని'గ్లోబల్ డిమ్మింగ్ ' అంటారు.భూమికి సూర్యుడే ప్రధానమైన శక్తి.ఆ వనరులు తగ్గిపోవడం అత్యంత ప్రమాదకరం.ఇప్పటికైనా మేలుకోవాలి. గ్రీన్ వాయివులను తగ్గించుకోవాలి. సౌరశక్తి, పవన శక్తిని ఎక్కువగా సద్వినియోగం చేసుకోవాలి. కార్బన్ వాడకాన్ని తగ్గించడం ఎంత ముఖ్యమో,అడవులను పెంచడం అంతకంటే ముఖ్యం.పబ్లిక్ రవాణా విధానంలో చాలా మార్పులు రావాలి.కార్లు మొదలైన వాహనాల వాడకం తగ్గించి, నడక, సైకిళ్ల వాడకం పెంచమని నిపుణులు సూచిస్తున్నారు. భూతాపం వల్ల 2030 నాటికి మరో 12 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికంలోకి వెళ్ళనున్నారని నివేదికలు చెబుతున్నాయి.వాతావరణాన్ని మనకు అనుకూలంగా మలుచుకోవడంలో ఆరోగ్యకరమైన విధానాలను పాటిస్తే ఉధృతి తీవ్రత తగ్గుముఖం పడుతుంది. ప్రకృతిని గౌరవిస్తే, అది మనల్ని కాపాడుతుంది.

# ఉద్యమాలే ఊపిరిగా రాజ్యలక్ష్మీ దేవి

**జననం: 1914 మే 18**
**మరణం: 2010 ఆగస్టు 7**



పుట్టింది మెట్టింది సంపన్న కుటుంబంలోనే. చుట్టూ పరదాలు కట్టి గుర్రం బండ్లలో ప్రయాణం చేయటం ఆ కుటుంబాల సంప్రదాయం. వాటికి స్వస్తి పలికి పురుషులతో సమానంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొంది. గాంధీజీ సూచనల మేరకు ఖద్దరు బట్టలు మాత్రమే ధరించింది. అరెస్టయింది. జైలు జీవితం గడిపింది. ఉన్నత కుటుంబలో జన్మించి కూడా వ్యవసాయ కూలీగా వేషం మార్చుకుంది. రహస్య జీవితం గడిపింది. స్వాతంత్ర్య సమర వీరులకు అవసరమైనవి అందించింది. బాలికల విద్యా వ్యాప్తికి విశేష కృషి సల్పింది. నిజాం పాలకుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం నడిపింది. ఆ ఉద్యమ వార్తల ప్రచారం కోసం తెలుగుదేశం వారపత్రికను కూడా ప్రారంభించి చరిత్రలో నిలిచారు సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి. రాజ్యలక్ష్మీ దేవి 1914 మే 18న జన్మించారు. కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలోని వీరులపాడు ఆమె జన్మస్థలం. వాసిరెడ్డి సుబ్బమ్మ, సీతారామయ్య దంపతుల చివరి సంతానం. గ్రామాలలో ఉండి చదువుకోవటానికి అవకాశాలు అంతగా లేని రోజులవి. అయినా వీరులపాడులో సీతారామయ్య ప్రోత్సాహంతో ఒక ప్రభుత్వ పాఠశాల వెలిసింది. హనుమయ్య చౌదరి ఆ పాఠశాలలో ఉపాధ్యాయునిగా కొనసాగుతుండే వారు. హనుమయ్య చౌదరి శిక్షణలో రాజ్యలక్ష్మీ దేవి మంచి ప్రావీణ్యం సంపాదించుకున్నారు. ఆమె మేనమామల స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చేబ్రోలు గ్రామం. వారో ప్రోద్బలంతో 1925లోనే రాజ్యలక్ష్మీ దేవి వివాహం, చేబ్రోలుకు చెందిన సూర్యదేవర నాగయ్యతో జరిగింది. అప్పటికి ఆమె వయసు 11 ఏళ్ళు. బాల్య వివాహాలు ఆ రోజుల్లో సహజం. వివాహం జరగటం వల్ల ఆమె చదువు ముందుకు సాగలేదు. మకాం చేబ్రోలుకు మారింది. బాల్యం నుండి స్వాతంత్ర్య భావాలను అలవరచుకొన్న రాజ్యలక్ష్మీ దేవి, మెట్టినింటికి వెళ్ళాక కూడా వాటిని వదులుకోలేదు. భార్య మనసు నెరిగిన భర్తగా నాగయ్య కూడా ఎదురు చెప్పలేదు. పైగా ప్రోత్సాహం కూడా లభించింది. ఆమె తోడికోడలు కూడా ఆమెకు సహకరించారు. ఇద్దరూ ఉద్యమాల్లో పాల్గొంటూ మరి కొందర్ని ఆ వైపుగా నడిపించుకోగలిగారు. 1932 జనవరి 26న శాసనోల్లంఘనం చేసి మొదటిసారి అరెస్టయ్యారు. రాజ్యలక్ష్మీతో పాటు ఇతర మహిళా ఖైదీలను కూడా రాయవేలూరు జైలుకు తరలించారు. ఆరు నెలల అనంతరం మద్రాసు జైలుకు మార్చారు. అక్కడ ఏడాది శిక్ష అనుభవించి 1933లో శిక్షానంతరం విడుదల చేయబడ్డారు. జైలు జీవితం గడిపే కాలంలో పలువురు మహిళా మేధావులతో పరిచయాలు ఏర్పడ్డాయి. మార్గరెట్ కజిన్స్ వద్ద ఆంగ్లం నేర్చుకొనే అవకాశం కూడా జైలులోనే కలిగింది. అలానే హిందీ భాష పట్ల కూడా దృష్టి మళ్ళింది.జైలులో గడిపే రోజుల్లో చుండూరి రత్నమ్మ, చోడగం అమ్మన్న రాజా, రాధాబాయి, సుబ్బరాయన్ లాంటి ప్రముఖులతో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి వచ్చాక కూడా సేవాకార్యాక్రమాల్లో వెనకడుగు వేయలేదు. 1936వ సంవత్సరం ఆమె జీవితంలో మరుపురాని ఏడాది. ఆ ఏడాది జిల్లా బోర్డుకు ఎన్నికలు జరిగాయి. ఆమె సహచరులంతా జిల్లా బోర్డు సభ్యునిగా రాజ్యలక్ష్మి దేవిని పోటీకి నిలబెట్టారు. ఆమెకు ప్రత్యర్థి త్రిపురనేని రామస్వామి చౌదరి. అప్పటికే రామస్వామి చౌదరికి గుంటూరు జిల్లా వ్యాపితంగా మంచి గుర్తింపు ఉంది.తప్పని పరిస్థితుల్లో పోటీకి కలబడవలసి వచ్చింది. రాజ్యలక్ష్మి దేవికి డిపాజిట్లు కూడా రావన్నది పరిశీలకుల అంచనా. అందరి అంచనాను తారుమారు చేసి రామస్వామి చౌదరిని ఓడించి, పరిశీలకులను సైతం ఖంగు తినిపించారు. అప్పటికే చేబ్రోలులో హిందీ పాఠశాల నడుస్తుండేది. దానిలో చేరి హిందీ భాషలో మెరుగులు దిద్దుకున్నారు. భాషా విశారద పరీక్ష రాసి ఉత్తీర్ణురాలైనారు. ఒకానొక సమయంలో సన్నిహితులతో కలిసి మద్రాసు వెళ్ళారు. దుర్గాబాయ్ సూచనల మేరకు మెట్రిక్ పరీక్ష రాసి కూడా ఉత్తీర్ణురాలైనారు. 1941లో చేబ్రోలులోని జాతీయ హిందీ విద్యాలయం కార్యదర్శిగా నియమితులయ్యారు. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని మరో మారు అరెస్టయ్యారు. 1942లో జయప్రకాష్ నారాయణ్ ఆంధ్రకు విచ్చేశారు. వారి కవసరమైన ఏర్పాట్లు చేయటం కోసం అయిదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది కాంగ్రెసు అధిష్ఠానం. ఆ అయిదుగురిలో రాజ్యలక్ష్మీ దేవి ఒకరు కావటం విశేషం. 1942-1945 మధ్య కాలంలో మగవాళ్ళ అరెస్టులు ఉధృతంగా ఉండేవి. పోలీసుల నుంచి తప్పించుకోవటానికి అనేక యాతనలు పడుతుండేవారు. అలా అవస్థలు పడుతున్న మగవాళ్ళకు ఆహార పదార్థాలు అందించటానికి మహిళలు మారువేషాల్లో తిరిగి, పోలీసుల కళ్ళుగప్పి అజ్ఞాతంలో ఉన్న వారి ఆకలుదప్పులను తీర్చుతుండేవారు.1945 అక్టోబరు 2న (గాంధీ జయంతి) చేబ్రోలులో ఆంధ్ర రాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. మహిలలో రాజకీయ పరిజ్ఞానం ఇనుమడింప చేయాలనే సదుద్దేశ్యంతో ఈ రాజకీయ పాఠశాల ప్రారంభించారు. దాని ప్రారంభానికి టంగుటూరి ప్రకాశం, కళా వెంకట్రావు, కల్లూరి చంద్రమౌళి లాంటి రాజకీయ దురంధరులు విచ్చేశారు. రాజ్యలక్ష్మీ దేవి అప్పటికి తన వద్ద నున్న 800 రూపాయలు టంగుటూరి ప్రకాశానికి అందించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. 45 రోజుల పాటు ఈ రాజకీయ శిక్షణ తరగతులు కొనసాగాయి. 47 మంది మహిళలు ఇక్కడ శిక్షణ పొందారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక స్వాతంత్ర్య ఉద్యమానికి ఫుల్ స్టాప్ పడింది. అటు తర్వాత మద్యపాన నిషేధ ఉద్యమం, గ్రంథాలయ ఉద్యమం లాంటి వాటిల్లో ఆమె చురుగ్గా పాల్గొన్నారు.ఆ తర్వాత ఆమె దృష్టి హైదరాబాదు వైపు మళ్ళింది. తెలంగాణ వాసులు నిజాం పాలకుల నిరంకుశత్వంలో కొట్టుమిట్టాడుతున్నారు. వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. నిజాం పాలకుల నిరంకుశ పాలనను ఎండగట్టాలని నిర్ణయించుకున్నారు. అందుకు ఒక ఆయుధం కోసం వెదుకులాట ప్రారంభించారు. సమాచారం సత్వరమే ప్రజలకు అందాలంటే పత్రిక అవసరమనే అభిప్రాయం ఆమెలో కలిగింది. సన్నిహితులతో సంప్రదించి, ఒక వారపత్రికను ప్రారంభించారు. దాని పేరు "తెలుగుదేశం". 1948 జూన 8వ తేదీన తెలుగుదేశం వారపత్రిక విజయవాడలో ప్రారంభమైంది. తెలంగాణలో జరుగుతున్న నిజాం పాలకుల అరాచకాలను ఎప్పటికప్పుడు ఆ పత్రికలో పొందుపరుస్తూ తెలంగాణలోని పలు ప్రాంతాలకు తెలుగుదేశాన్ని పంపుతుండేవారు. ఈ పత్రిక వ్యాపార సరళిలో కాకుండా ఆదర్శ విధానంలో ముద్రించబడుతూ నిజాం పాలకులకు 'పక్కలో బల్లెం'లా తయారైంది. తెలంగాణ తెలుగు ప్రజల ఇబ్బందులు, ఇక్కట్లు ఏకరువు పెట్టటం కోసం ఒక ఆంధ్ర మహిళ ప్రారంభించిన పత్రికకు ప్రజాదరణ పెరిగింది. నిజాం పాలకులు దాన్ని నిషేధించాలని ప్రయత్నించారు. చివరకు హైదరాబాదు నిజాం పాలకులను మిలటరీ చుట్టుముట్టి భారతదేశంలో కలపటంతో వారి శకం ముగిసిపోయింది. తెలంగాణ వాసులు ఊపిరి పీల్చుకునారు. తెలంగాణ వాసుల పొగడ్తలు అందుకున్న ఆంధ్ర మహిళ సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి 2010 ఆగస్టు 7న స్వర్గస్థురాలైనారు.

- దాసరి ఆళ్వారస్వామి

# వాకింగ్ గురించి ఈ 10 విషయాలు తప్పక తెలుసుకోవాలి



మీకు హిపోక్రాట్స్ తెలుసా? ఆయన ఇప్పటి వాడు కాదు. క్రీస్తు పూర్వం 460వ సంవత్సరానికి చెందిన వాడు. అప్పట్లోనే వైద్య రంగ నిపుణుడిగా పేరుగాంచాడు. అందుకే ఆయన్ను ఫాదర్ ఆఫ్ మెడిసిన్ అని పిలుస్తారు. ఇంతకీ అసలు విషయం ఏంటో తెలుసా..? ఏమీ లేదండీ.. సదరు హిపోక్రాట్స్ అనే ఆయన వాకింగ్ గురించి ఓ కొటేషన్ చెప్పారు. అదేమిటంటే.. వాకింగ్ ఈజ్ ఎ మ్యాన్స్ బెస్ట్ మెడిసిన్.. అని ఆయన అన్నారు. అవును, మీరు విన్నది నిజమే. ఈ క్రమంలోనే ప్రతి రోజూ కనీసం 15 నుంచి 30 నిమిషాల పాటు అయినా వాకింగ్ చేస్తే దాంతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఆయన చెప్పారు. మరి అవేమిటో ఇప్పుడు తెలుసుకుందామా..! 1.వాకింగ్ రెగ్యులర్‌గా చేయడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు అనబడే హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, కంగారు వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే వయస్సు మీద పడడం కారణంగా వచ్చే దెమెంతియా, అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి. 2.నిత్యం వాకింగ్ చేయడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. కంటికి సంబంధించిన పలు నాడులు కాళ్లలో ఉంటాయి. అందుకనే కాళ్లతో వాకింగ్ చేయడం వల్ల కంటి ఆరోగ్యం కూడా మెరుగు పడుతుందట. నిత్యం వాకింగ్ చేస్తే కళ్లపై అధిక ఒత్తిడి తగ్గడంతోపాటు గ్లకోమా వంటి కంటి వ్యాధులు రాకుండా ఉంటాయట. 3.నిత్యం రన్నింగ్ చేస్తే ఎలాంటి లాభాలు కలుగుతాయో అదేలాంటి బెనిఫిట్స్ వాకింగ్ చేయడం వల్ల కూడా కలుగుతాయని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చెబుతోంది. నిత్యం వాకింగ్ చేస్తే గుండె సమస్యలు, హార్ట్ ఎటాక్‌లు రావట. అలాగే హైబీపీ, కొలెస్ట్రాల్ తగ్గుతాయట. దీంతోపాటు శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుందట. 4.వాకింగ్ చేయడం వల్ల శరీరం ఆక్సిజన్‌ను ఎక్కువగా గ్రహిస్తుంది. దీంతో అదే ఆక్సిజన్ రక్తంలో చేరి అది ఊపిరితిత్తులకు అందుతుంది. ఈ క్రమంలో సదరు ఆక్సిజన్ ఊపిరితిత్తుల్లో ఉండే టాక్సిన్లు, విష, వ్యర్ధ పదార్థాలను బయటకు పంపుతుంది. అలాగే ఇతర ఊపిరితిత్తుల సమస్యలు దూరమవుతాయి. 5.డయాబెటిస్ ఉన్నవారు నిత్యం రన్నింగ్ కన్నా వాకింగ్ చేస్తేనే ఎంతో ప్రయోజనం కలుగుతుందట. 6 నెలల పాటు వాకింగ్, రన్నింగ్ చేసిన కొందరు డయాబెటిస్ పేషెంట్లను సైంటిస్టులు పరిశీలించగా ఈ విషయం వెల్లడైంది. వాకింగ్ చేసిన వారిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు బాగా అదుపులోకి వచ్చాయని సైంటిస్టులు గుర్తించారు. అందువల్ల రోజూ వాకింగ్ చేస్తే డయాబెటిస్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వారు చెబుతున్నారు. 6.నిత్యం కనీసం 30 నిమిషాల పాటు వాకింగ్ చేస్తే పెద్ద పేగు క్యాన్సర్ వచ్చే ముప్పు చాలా వరకు తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అలాగే జీర్ణప్రక్రియ మెరుగు పడుతుంది. మలబద్ధకం పోతుంది. విరేచనం రోజూ సాఫీగా అవుతుంది. 7.నిత్యం 10వేల స్టెప్స్ (100 నిమిషాలు) పాటు వాకింగ్ చేస్తే అధిక బరువు త్వరగా తగ్గుతారని పరిశోధనలు చెబుతున్నాయి. దీంతోపాటు కండరాలు దృఢంగా మారుతాయట. 8.నిత్యం వాకింగ్ చేయడం వల్ల కీళ్లు బాగా పనిచేస్తాయి. అవి అంత త్వరగా అరిగిపోవు. అలాగే ఎముకల్లో సాంద్రత పెరుగుతుంది. దీంతో ఫ్రాక్చర్లు, కీళ్ల నొప్పులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఇందుకు రోజూ కనీసం 30 నిమిషాల పాటు అయినా వాకింగ్ చేయాలి. ఇలా చేస్తే కీళ్ల నొప్పులు, వాపులు కూడా తగ్గుతాయి. 9.బ్యాక్ పెయిన్‌తో సతమతమయ్యేవారికి వాకింగ్ చక్కని ఔషధం అనే చెప్పవచ్చు. లో ఇంపాక్ట్ వ్యాయామం కిందకు వాకింగ్ వస్తుంది. కనుక నడుంపై పెద్దగా ఒత్తిడి పడదు. దీనికి తోడు ఆ భాగంలో ఉండే ఒత్తిడి, నొప్పి కూడా పోతాయి. రక్త సరఫరా పెరిగి నొప్పి తగ్గుతుంది. కనుక వెన్ను నొప్పి ఉన్నవారు నిత్యం వాకింగ్ చేయడం మంచిది. 10.నిత్యం వాకింగ్ చేయడం వల్ల ఎప్పుడూ డిప్రెషన్‌లో ఉండే వారు మంచి మూడ్‌కు వస్తారట. వారు హ్యాపీగా ఉంటారని పరిశోధనలు చెబుతున్నాయి. కనుక నిత్యం వాకింగ్ చేయడం మంచిది.

- సేనాధిపత్యం రమేష్

# అమ్మ పాత్రల్లో ఒదిగి పోయిన మహానటి శాంతకుమారి



చిత్రసీమలో ఆదర్శప్రాయమైన జంటల్లోపుల్లయ్య, శాంతకుమారి ముందు వరుసలో ఉంటారు.ఆ జంటను పలువురు నటీనటులు, నిర్మాతలు, సాంకేతికనిపుణులు మమ్మీ, డాడీ అంటూ అభిమానంగా పిలుచుకునేవారు. ఆ దంపతులు సైతం వారినందరినీ తమ కన్నబిడ్డల్లాగే చూసుకొనేవారు. అయితే అలా అమ్మగా పిలిపించుకుంటూనే 'అమ్మ' పాత్రల్లో మేటిగా నటించి మెప్పించారు నటి శాంతకుమారి. నిజ జీవితంలోనూ ఎందరి చేతనో 'అమ్మా' అని పిలిపించుకున్న ఆ మహానటి అమ్మ పాత్రల్లో ఒదిగిపోయారు. అమ్మంటే ఇలానే ఉండాలనిపించేలా ఉండే ఆమె నటన, ఆమెకే కాదు, ఆ పాత్రకు కూడా విపరీతమైన ప్రాచుర్యం తీసుకొచ్చేది. శాంతకుమారి అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. 1920 మే 17న కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో వెల్లాల శ్రీనివాసరావు, పెద్ద నరసమ్మ దంపతులకు ఆమె జన్మించారు. శ్రీనివాసరావుకు లలితకళలంటే ఎంతో అభిమానం. దాంతో కూతురు సుబ్బమ్మను పిన్నవయసులోనే మద్రాసులో ఉన్న ప్రొ.పి.సాంబమూర్తి దగ్గర కర్ణాటక సంగీతం, వయొలిన్ లో శిక్షణనిప్పించారు. ఈ క్రమంలో పదమూడేళ్ళ వయసులోనే సుబ్బమ్మ కర్ణాటక సంగీతంలోను, వయొలిన్‌లోనూ ఉత్తీర్ణురాలయ్యింది. తరువాత గురువుగారితో కలసి దక్షిణ భారతదేశ మంతా తిరిగి వందలాది కచేరీలు చేసింది. పదహారేళ్ళ వయసులోనే విద్యోద యా స్కూలులో సంగీతం టీచర్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఆల్ ఇండియా రేడియోలో సైతం గాయనిగానూ పనిచేశారామె. సుబ్బమ్మ కచేరి చూసిన దర్శక-నిర్మాత పి.వి.దాసు మాయాబజార్ (1936) లేదా శశిరేఖ పరిణయం చిత్రంలో శశిరేఖ పాత్రను ఇచ్చారు. కానీ సుబ్బమ్మ సినిమాలలో నటించటానికి ఆమె బామ్మ నిరాకరించింది. దీంతో పి.వి.దాసు మరియు అతని మేకప్ మేన్ అయిన మంగయ్యలు ఆమె బామ్మను ఒప్పించారు. సుబ్బమ్మను శశిరేఖ వేషంలో చూసిన ఆమె బామ్మ చివరకు ఆమె సినిమాలో నటించడానికి ఒప్పుకొంది. సుబ్బమ్మ పేరు కొంచెం పాతగా ఉందని ఆమె పేరును శాంతకుమారిగా మార్చారు. తరువాతి సంవత్సరం లోనే పి.పుల్ల య్య దర్శకత్వ ంలో రూపొందిన 'సారంగధర'లో చిత్రాంగిగా తన పాటతోనూ, నటనతోనూ మురిపించారు. ఈ సినిమా పూర్తికాగానే తన 17వ యేట ఆ చిత్ర దర్శకుడు పి.పుల్లయ్యను వివాహమాడారు . 1939లో తన భర్త తెరకెక్కించిన 'బాలాజీ' చిత్రంలో పద్మావతిగా నటించి మెప్పించారు. ఆ సినిమా కథనే తరువాత 1960లో 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం'గా రూపొందించారు పుల్ల య్య. ఇందులో యన్టీఆర్ శ్రీనివాసునిగా నటించగా, వకుళ మాతగా శాంతకుమారి అభినయించారు. ఈ చిత్రమే యన్టీఆర్ ను తెరవేలుపుగా నిలిపింది. థియేటర్లను దేవాలయాలుగా మార్చింది. శాంత కుమారి మొదట్లో అన్నీ పురాణాలు ఇతివృత్త ంగా ఉన్న చిత్రాలలోనే నటించారు. యశోదగా కూడా నటించి న ఆమె కృష్ణుని ముద్దుచేస్తూ "చిరు చిరు నగవులు చిందే తండ్రీ" అనే మధురమైన పాటను అద్భుతంగా పాడారు. శాంతకుమారికి మెదటి సాంఘిక చిత్రం ధర్మపత్ని. అందులో అక్కినేని నాగేశ్వరరావు విద్యార్థిగా నటించారు. అక్కినేనికి శాంతకుమారికీ మధ్య ఎంతో ఆత్మీయ మైన అనుబంధం ఉండే ది. అక్కినేనిని ఆమె అప్యాయంగా అబ్బి అని పిలుచుకునేవారు. మాయలోకం సినిమాలో అక్కినేనికి ప్రక్క కథానాయికగా నటించిన శాంతకుమారి, జయభేరి సినిమాలో వదినగా నటించారు, అర్ధాంగి సినిమాలోనైతే సవతి తల్లిగా నటించారు. ఎన్.టి.ఆర్‌కు కూడా తల్లా పెళ్ళామా సినిమాలో బామ్మగా నటించారు. తన భర్త దర్శకత్వం వహించిన పలు చిత్రాలలో శాంతకుమారి నాయికగానూ, కీలక పాత్రల్లోనూ నటించారు. 1947లో పుల్లయ్య, శాంతకుమారి దంపతులు రాగిణి పిక్చర్స్ అనే సంస్థను స్థాపించి, పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. తరువాత 'పద్మశ్రీ పిక్చర్స్' పతాకంపైనా అనేక సినిమాలను నిర్మించి, తెలుగు వారిని ఆకట్టుకున్నారు. ఈ చిత్రాలన్నింటా శాంతకుమారి తనకు తగ్గ పాత్రలు ధరించి మెప్పించారు. తన కంటే వయసులో చిన్నవారయిన ఏయన్నార్, గుమ్మడి వంటి వారికి జోడీగానూ నటించారు శాంతకుమారి. తరువాతి రోజుల్లో యన్టీఆర్, ఏయన్నార్, జగ్గయ్య, శివాజీగణేశన్, జెమినీ గణేశన్ వంటి మేటి నటులకు తల్లిగా నటించి మెప్పించారు. అలాగే, తన దగ్గరుకు వచ్చిన పాత్రలకు న్యాయం చేయడంలో శాంతకుమారి ఎప్పుడూ ముందుండేవారు. మాయాబజార్ లేదా శశిరేఖాపరిణయం (1936) సారంగధర (1937), రుక్మిణీ కల్యాణం (1937) భక్తజయదేవ (1938) శ్రీ వెంకటేశ్వర మహత్యం (1939) ధర్మపత్ని (1941) కృష్ణ ప్రేమ (1943) (రాధ పాత్ర) మాయాలోకం (1945), గుణసుందరి కథ (1949) (గుణసుందరిదేవి దుష్ట బుద్ధిగల అక్కగా) షావుకారు (1950), ధర్మదేవత (1952) (కాత్యాయిని పాత్ర), అర్ధాంగి (1955), సారంగధర (1957) జయభేరి (1959) (అన్నపూర్ణ పాత్ర), శ్రీ వెంకటేశ్వర మహా త్యం (1960) (వకుళ పాత్ర) సిరిసంపదలు (1962), ప్రేమించి చూడు (1965), ప్రాణమిత్రులు (1967) బంగారు పిచ్చుక (1968) అక్కాచెల్లెలు (1970) (జడ్జి రామచంద్రరావు గారి తల్లి) ప్రేమనగర్ (1971) కొడుకు కోడలు (1972), సోగ్గాడు (1975) తదితర చిత్రాలు ఆమెకు విపరీతమైన ప్రాచు ర్యాన్ని సంపాదించిపెట్టాయి. 1979 వరకు శాంతకుమారి నటిగా కొనసాగారు. 1981లో పి.పుల్లయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డుతో గౌరవించింది. 1999లో శాంతకుమారికి రఘుపతి వెంకయ్య అవార్డు లభించింది. 2006 జనవరి 16న శాంతకుమారి కన్నుమూశారు

-దాసరి దుర్గా ప్రసాద్

## సమస్యాత్మక గ్రామాలలో

# కొనసాగుతున్న పోలీస్ పీకేట్‌లు

### పీకేట్ విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**బాపట్ల మే 16 (ఆంధ్రపత్రిక) :** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పీకేట్ లను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆ ప్రాంతాలలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, అవాంఛనీయ ఘటనలకు, ఘర్షణలకు పాల్పడితే తీసుకునే చట్టపరమైన చర్యలు గురించి, తదనంతర పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎవరు కూడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచిస్తున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల రోజు, తదనంతర పరిణామాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పీకేట్ లను ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ఆ ప్రాంతాలలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు రక్షణగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. పీకేట్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆ ప్రాంతంలోని పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే వారి గురించి పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని, అవాంఛనీయ ఘటనలకు ఎవరైనా పాల్పడితే వారి పై తీవ్రమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

## ఇనెరా బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంఎస్ ధోని




**విశాఖపట్నం మే 16 (ఆంధ్రపత్రిక) :** వ్యవసాయ జీవశాస్త్రాలను అభివృద్ధి చేస్తున్న సుదీర్ఘ అనుభవం గల ఆర్ అండ్ డి బయోసైన్స్ సంస్థ ఇనెరా ఎంఎస్ ధోనిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా, ధోని ప్రజలలో సుస్థిరమైన వ్యవసాయ బయో ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ పరివర్తనకు మద్దతును అందిస్తారని ఇనెరా ఫౌండర్ ఆగమ్ ఖరే అన్నారు. రసాయన రహిత వ్యవసాయం సాదించడం ఇనెరా ఉత్పతులు యొక్క లక్ష్యం , ఇనెరా తో ఈ మార్పు కోసం పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నామన్నారు. వ్యవసాయం ఎల్లప్పుడూ నా మనసుకు దగ్గరగా ఉంటుంది మరియు ఇనెరా అందించే గొప్ప పనితీరు గల ఉత్పత్తులను ఉపయోగించి ప్రగతిశీల వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా నేను లక్షలాది మంది రైతులకు స్ఫూర్తినిచ్చేందుకు ఎదురు చూస్తున్నామన్నారు. వ్యవసాయంలో రసాయనిక ఉత్పత్తులకు సుస్థిర ప్రత్యామ్నాయాలుగా వ్యవసాయ జీవశాస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా పట్టు సాధిస్తున్నాయనీ, కఠినమైన పర్యావరణ నిబంధనలు సేంద్రియ ఉత్పత్తులకు పెరుగుతున్న వినియోగదారుల డిమాండ్ కారణంగా, ఉత్తర అమెరికా ఐరోపా వంటి ప్రాంతాలు వీటిని అమలుచేస్తూ ఆసియా-పసిఫిక్ లాటిన్ అమెరికాలో గణనీయమైన వృద్ధిని సాధిస్తున్నాయన్నారు. ఇటీవల భారత ప్రభుత్వం చేపట్టిన పరంపరాగత్ కృషి వికాస్ యోజన (పీకే వీ వై) వంటి విధాన కార్యక్రమాలు బయో ఇన్‌పుట్‌లను ప్రోత్సహించడం వాటిని ఉపయోగించడానికి రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించడం లక్ష్యంగా నిర్దేశించుకున్నాయనీ చెప్పారు.

## సీనియర్ రెసిడెంట్ ఖాళీ భర్తీకి ప్రకటన

**విజయవాడ, మే 16 (ఆంధ్రపత్రిక) :** విజయవాడ లోని ప్రభుత్వ దంత కళాశాల మరియు ఆసుపత్రిలో PEDODONTICS విభాగంలో సీనియర్ రెసిడెంట్ ఖాళీ భర్తీకి ఈ నెల 28న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ దంత వైద్య కళాశాల మరియు ఆసుపత్రి ఇంచార్జి ప్రిన్సిపాల్ జె. నరేంద్రదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన వారు సీనియర్ రెసిడెంట్ ఖాళీకి అర్హులని, ఒక సంవత్సర కాలం పాటు పనిచేయవలసి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు http://gdchvja.inవెబ్ సైట్‌ను సందర్శించగలరని అయన తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారని అర్హత గలిగి ఆసక్తి గల అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూ కు హాజరు కావచ్చునని ప్రభుత్వ దంత వైద్య కళాశాల మరియు ఆసుపత్రి ప్రిన్సిపాల్ జె. నరేంద్రదేవ్ తెలియజేసారు.

## బాపట్ల జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్ చేస్తుంది



**బాపట్ల మే 16 (ఆంధ్రపత్రిక) :** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బాపట్ల జిల్లాలో కూటమి అన్ని నియోజకవర్గాల్లో గెలిచి క్లీన్ స్వీప్ చేస్తుందని బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్ బాబు చెప్పారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో టిడిపి శ్రేణులపై వైసీపీ నాయకులు అమానుషంగా దాడి చేశారన్నారు. టీడీపీ పార్టీకి ప్రజలు మొగ్గు చూపటంతో ఓటమి భయం జీర్ణించుకోలేని వైసీపీ శ్రేణులు ఇలాంటి దాడులను ప్రోత్సహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పొత్తులో భాగంగా జనసేన పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో తమ ఓటింగ్‌ను కూటమి అభ్యర్థులకు మళ్లించడం జరిగిందన్నారు. బాపట్లలో జరిగిన ఘర్షణలపై ఎన్నికల కమిషన్ కు బాపట్ల జిల్లా పోలీసు పరిశీలకులకు ఫిర్యాదు చేశామన్నారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన పర్చూరు వాసులకు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. త్వరలోనే బాపట్ల పట్టణంలో జిల్లా స్థాయి టిడిపి కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు.

## కాంగ్రెస్ విజయానికి కృషిచేసిన అందరికీ ధన్యవాదాలు

### ఎన్టీఆర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు బొర్రా కిరణ్



**మైలవరం, మే 16: (ఆంధ్రపత్రిక) :** ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన ఎన్నికలలో అధికార మరియు ప్రతిపక్ష పార్టీలు ఎన్నో ఆశలు చూపిన అటు వైపు కూడా కన్ను ఎత్తిచూడకుండా నాయకులు, మరియు కార్యకర్తలు తమ వెంట ఉండి ప్రతిరోజు ప్రచారంలో పాల్గొని పోలింగ్ అయ్యే వరకు కష్టపడిన పని చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాం అని ఎన్టీఆర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, మైలవరం నియోజకవర్గ ఇండియా కూటమి అభ్యర్థి బొర్రా కిరణ్ అన్నారు. గురువారం నాడు ఆయన ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఇండియా కూటమి అధికారం లోకి రానున్నది అని, అలాగే రాష్ట్రము లో కూడా పార్టీ నుండి అభ్యర్థులు గెలవబోతున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం రాహుల్ గాంధీ, వైస్ షర్మిలా రెడ్డిల నాయకత్వంలో పార్టీ బలోపేతం అవ్వనున్నదని ఈ సందర్భంగా బొర్రా కిరణ్ అన్నారు.

### పెడన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి మాతకు ప్రత్యేక పూజలు అభిషేకాలు హెూమాలు..



**పెడన 16 మే (ఆంధ్రపత్రిక) :** పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము నందు ఏప్రిల్ నెలలో నిర్వహించిన మహాకుంభాభిషే కం కార్యక్రమం నేటికీ 41 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ వాసవి క్షేత్రము నందు గోపూజ, గణపతి పూజ, పంచగవ్యం, మండపారాధన, శ్రీ వాసవి మాతకు 21 ద్రవ్యములతో అభిషేకములు, ప్రత్యేక పూజలు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి హెూమం తదితర పూజ కార్యక్రమాలను పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా, మంజులత దంపతులు వారి కుమార్తె ప్రేమాన్విత లచే శ్రీ వాసవి క్షేత్రం ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు ఆరుగురు రుత్వికులతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పెడన పట్టణ, మండలంలో ఉన్న ఆర్యవైశ్య సంఘీయుల 300 మంది పేర్లు గోత్రనామాలు పూజలు నిర్వహించారు. పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి వారు లలిత పారాయణం చదివారు. పెడన పట్టణ పరిసర ప్రాంత ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ వాసవి మాతను దర్శించుకున్న భక్తులకు పట్టణ ఆర్యవైశ్య సంఘం వారు తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా ఉపాధ్యక్షులు చిలకల శ్రీనివాస్ గుప్తా కార్యదర్శి జవాజి నాగు కార్యవర్గ సభ్యులు భోదినపల్లి సాంప్రసాద్ సభ్యులు కొల్లూరి భాస్కర్ శ్రీ వాసవి మహిళా మండలి గౌరవ సలహాదారులు కొల్లూరి మంజులత అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీ తయారు కార్యనిర్వాహక అధ్యక్షురాలు కొమ్మూరు విజయ దుర్గ ఉపాధ్యక్షురాలు కొమ్మూరి సుమన సభ్యులు కొల్లూరి పద్మ, కొల్లూరి అపర్ణ, కొల్లిపర సుందరి, పొట్టూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడులో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం ఖాయం

### కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారధి

**నూజివీడు, మే 16: (ఆంధ్రపత్రిక):** ఏలూరు జిల్లా చాట్రాయి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం లో నూజివీడు టిడిపి కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. తనకు ఓటు వేసేందుకు కృషి చేసిన కార్యకర్తలకు నాయకులకు అభిమాను లకు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్థ సారథి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గం లో కూటమి విజయం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. నూజివీడు నియోజకవర్గం లో ప్రజలు తెలుగుదేశం పార్టీ జనసేన, బిజెపి పార్టీలకు ప్రజలు మద్దతు తెలిపారని ఆయన అన్నారు మండలంలోని 18 గ్రామపంచాయతీ నాయకులు పార్టీ కార్యకర్తలు తన కోసం కష్టపడి పని చేసి నందుకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు 10 వేల మెజార్టీతో మాజీవీడులో కూటమి గెలవడం ఖాయమని కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధి కారంలోకి రాబోతుందని ముఖ్యమంత్రిగా చంద్ర బాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని 120 సీట్లు కూటమికి రావడం ఖాయమని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరం పూడి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, తెలుగు యువత జిల్లా ప్రధానకార్యదర్శి తల్లాడ శ్రీనివాసరావు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మురిడి చిట్టిబాబు, ప్రముఖ లాయర్ అత్తులూరి, మాజీ సర్పంచులు రాజరత్నం, రామ్ రాస్, కృష్ణారావు పాలెం సర్పంచి చిమట: బోయిన పుల్లారావు, బొట్టు రామచంద్రరావు, ఎస్ఆర్ఐ బొట్టు వంశీ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

## పేట గ్రంధాలయం నందు వేసవి శిక్షణా తరగతులు



**జగ్గయ్యపేట, 16మే (ఆంధ్రపత్రిక) :** ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంధాలయ సంచాలకుల వారి ఆదేశాల సారం ది.16.5.2024 నుండి జూన్ 7 2024 వరకు గ్రేడ్ 1 శాఖా గ్రంధాలయం జగ్గయ్యపేట నందువేసవి శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. ది.16.5.2024 నఉదయం 8గంటలనుండి 12 గంటవరకు విద్యార్థులచే పుస్తక పఠనం,కథల పుస్తకాలతో దేశానాయకుల పుస్తకాలు చదివించినాము. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినాము. ఈ పుస్తక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా కొనకంచి పాఠశాల హెడ్ మాస్టర్ రమణ పాల్గొన్నారు. చివరగా ఉపాధ్యాయురాలు శ్రీమతి రేణుక జనరల్ సైన్సు లో విద్యార్థులకు ఉపయోగపడే విషయాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాలలో విద్యార్థులు ప్రతిరోజు పాల్గొని ఉపయో గించుకోగలరు. ఈకార్యక్రమంలో గ్రంధాలయ అధికారిణి శ్రీమతి ఆలేటి. ప్రభ,సిబ్బంది జె. శ్యామల,రమేష సత్యావతి పాల్గొన్నారు.

## బాపట్ల పట్టణంలో హత్యకు గురైన యువకుడు



**బాపట్ల జిల్లా మే 16 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల పట్టణంలో హత్యకు గురైన యువకుడు నెల్లూరు పట్టణానికి చెందిన నాయుడు కుప్పం ప్రశాంత్ (24) గుర్తించినట్లు సమాచారం. గతంలో ఓ హత్య కేసులో ఉన్న ప్రశాంత్ గత కొద్ది రోజుల క్రితమే బెయిలుపై బయటకి వచ్చినట్లు తెలుస్తోంది. బాపట్లలో మృతుడు తండ్రి ఉండటంతో బాపట్ల వచ్చినట్లు సమచారం. నెల్లూరుకు చెందిన వ్యక్తులు హత్య చేసి ఉంటారని భావిస్తున్న పోలీసులు. నెల్లూరు పెన్న నది వైకుంఠపురం వాసిగా గుర్తింపు.

## పోలవరంలో పుట్టా మహేష్ యాదవ్ ప్రచారం



**నూజివీడు, మే 16 (ఆంధ్రపత్రిక) :** చాట్రాయి మండలం, పోలవరం గ్రామంలో పార్థసారధి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచారంలో భాగంగా నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం ,జనసేన,బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారధి కుమారుడు, కోడలు కొలుసు నితిన్ కృష్ణ కొలుసు అమృత, మరియు ఏలూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ప్రచారంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నితిన్ కృష్ణ మాట్లాడుతు ఈ నెల 13వ తేదీన జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మీ అమూల్యమైన, అతి విలువైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి నూజివీడు ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారధిని మరియు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ని అధ్యధిక మెజారిటితో గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం,జనసేన,బీజేపీ పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వలసపల్లిలో వైసిపికి భారీ షాక్

### టీడీపీలోకి చేరిన వైసిపి సర్పంచ్



**నూజివీడుమే 16 (ఆంధ్రపత్రిక)** ముసునూరు మండలం వలసప ల్లి గ్రామానికి చెంది న వైసిపి సర్పంచ్ చలసాని దామోదరావు, కొమ్మ కూరి వెంకటేశ్వరావు వార్డు నం బర్, యర్రా చంటి వార్డు నంబర్, బొప్పన శ్రీనివాస రావు వార్డు నంబర్, కొలు సు రంగమ్మ వార్డు నంబర్, నత్తా భాగ్యం వార్డు నంబ ర్, కోనేరు సుబ్బారావు, కోనేరు శ్రీనివాసరావు, దిమ్మిటి యేసురత్నం మేడిబొయిన శివనాగ మల్లేశ్వరరావు మరియు 200 కుటుంబాల వారు ఈ రోజు చలసాని దామోదరావు ఆధ్వర్యంలో నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం జనసేన బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారధి సమక్షంలో తెలుగుదేశం కండువాలు కప్పుకుని పార్టీలో చేరడం జరిగింది. ఈ సంద్భంగా దామోదరా వు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో సారధి విజయానికి నిరంత రం కృషి చేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.... ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మేదరమెట్ల సురేంద్ర, కొల్లి గంగరావు, గద్దె రఘు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### జి.కొండూరు మండలంలో పర్యటించిన తెదేపా మహాకూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

#### గ్రామాల్లో పార్టీ నేతలతో సమావేశం



**మైలవరం, (జి.కొండూరు), మే 16: (ఆంధ్రపత్రిక):** మైలవరం నియోజక వర్గ తెదేపా కూటమి అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్ర సాదు జి.కొండూరు మండలంలోని సున్నంపాడు, మునగపాడు గ్రామాల్లో గురువారం పర్యటించారు. మునగ పాడులో సాయిబాబా వారి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తన కోసం కష్టపడిన వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామాల్లో శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించిన కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. అందరికీ రుణపడి ఉంటానన్నారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ సరళిని, ఓటింగ్ శాతం నమోదుపై నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మహాకూటమి విజయం తథ్యమని అన్నారు. బీజేపీ, జనసేన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కొనకళ్ళకు గుండెపోటు!!!

### చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు!!!



**మచిలీపట్నం 16మే (ఆంధ్రపత్రిక) :** మచిలీపట్నం గురువారం తెలుగుదేశం పార్టీ బందరు మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావుకు తెల్లవారు జామున గుండెపోటు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు విజయవాడలోని రమేష్ ఆసుపత్రికి తరలింపు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. గతంలో తెలంగాణ, ఆంధ్ర విభజన సమయంలో ఢిల్లీలోని పార్లమెంట్లో మొదటి సారిగా గుండెపోటు రావటం, ఇది రెండో సారి.

ఆంధ్రపత్రిక
జిల్లాలకు విలేఖరులు కావలెను
స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన
ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914
విజయనగరం,అనకాపల్లి జిల్లాలోని నియోజకవర్గాలకు
మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
అచ్యుతాపురం, మునగపాక, యలమంచిలి, వి.మాడుగుల, బుచ్చయ్యపేట, పాయకారావు పేట, నర్సీపట్నం, విజయనగరం, ఎస్.కోట, జామి, వేపాడ, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, ఎల్.కోట, రాజాం.
ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

### యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు

# డాబర్ గ్లూకోజ్ 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారం





**విశాఖపట్నం, 16 మే (ఆంధ్రపత్రిక) :** హౌస్ ఆఫ్ డాబర్ నుండి ప్రముఖ ఇన్‌స్టంట్ ఎనర్జీ డ్రింక్ అయిన డాబర్ గ్లూకోజ్ యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించడానికి మరియు యువ క్రీడాకారులలో శక్తి మరియు సత్తువ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి 'ఎనర్జైజ్ ఇండియా' అనే మెగా క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. భారతదేశం అంతటా ప్రధాన క్రీడా అకాడమీలు. ప్రచారంలో భాగంగా, డాబర్ గ్లూకోస్ ప్రముఖ వైద్యుడు మరియు నిపుణులతో కూడిన బాక్సింగ్ అకాడమీ విశాఖపట్నంలో ఎనర్జీ మరియు స్టామినా మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక అవగాహన సెషన్‌ను నిర్వహించింది. ఈ సెషన్ అథ్లెట్లు వారి పనితీరును ఆప్టిమైజ్ చేయడానికి మరియు వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించడంలో సహాయపడటానికి విలువైన అంతర్దృష్టులు మరియు వ్యూహాలను అందించింది. డాబర్ ఈ అకాడమీలోని అగ్రశ్రేణి క్రీడాకారులను కూడా సత్కరించింది. మల్లికా . మెహెరున్నీసా బేగం జె భానుప్రకాష్. ఈ కార్యక్రమంలో డాబర్ ఇండియాకు చెందిన దినేష్ కుమార్, బాక్సింగ్‌లో ద్రోణాచారి అవార్డు గ్రహీత, ఐ వెంకటేశ్వరరావు, ఉషా నాగిశెట్టి ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత (ఇండియన్ రైల్వే), ఎం. దుర్గారావు కోచ్ బాక్సింగ్, దేశసేవా ఫౌండేషన్ కార్యదర్శి అమోల్ హండే, బాక్సింగ్ అకాడమీ కోచ్‌లు మరియు ఇతర సహచరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "యువ అథ్లెట్లలో శక్తి మరియు సత్తువ యొక్క ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి మరియు వారి సంబంధిత క్రీడలలో రాణించడానికి అవసరమైన శక్తిని అందించడానికి మా 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారాన్ని ప్రారంభించడం మాకు ఆనందంగా ఉంది. బ్రాండ్‌గా, డాబర్ గ్లూకోజ్ అథ్లెట్లకు ఖచ్చితంగా సరిపోతుంది, స్పోర్ట్స్ ఔత్సాహికులు మరియు చురుకైన జీవనశైలిని నడిపించే వ్యక్తులు శారీరక శ్రమలో నిమగ్నమైన వ్యక్తులకు తక్షణ శక్తిని అందించేలా రూపొందించబడింది, "అని డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్-హెల్త్ సప్లిమెంట్స్ శ్రీ ప్రశాంత్ అగర్వాల్ చెప్పారు. బాక్సింగ్‌లో స్పోర్ట్స్ ద్రోణాచారి అవార్డు గ్రహీత ఐ వెంకటేశ్వరరావు నిర్వహించిన ఎనర్జీ సెషన్‌లు సరైన పనితీరును నిర్ధారించడానికి సరైన పోషకాహారం మరియు హైడ్రేషన్ యొక్క ప్రాముఖ్యత గురించి యువ క్రీడాకారులకు అవగాహన కల్పించడంపై దృష్టి సారించాయి. సెషన్‌లో సత్తువ మరియు ఓర్పును మెరుగుపరచడానికి చిట్కాలు మరియు పద్ధతులు ఉన్నాయి, ఇవి ఏ అథ్లెట్‌కైనా కీలకమైనవి. "మా యువతలో ఆరోగ్యకరమైన మరియు చురుకైన జీవనశైలిని ప్రోత్సహించడానికి డాబర్ గ్లూకోజ్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది.యువ క్రీడాకారులతో ఈ భాగస్వామ్యం ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా మరో ముందడుగు. దాని రిఫ్రెష్ రుచి మరియు తక్షణ శక్తి బూస్ట్‌తో, డాబర్ గ్లూకోజ్ యువ క్రీడాకారులు శక్తివంతంగా ఉండటానికి మరియు వారి అత్యుత్తమ ప్రదర్శన చేయడానికి సరైన ఎంపిక," శ్రీ అగర్వాల్ జోడించారు. డాబర్ గ్లూకోజ్ గురించి: డాబర్ గ్లూకోజ్ అనేది 99.4% స్వచ్ఛమైన గ్లూకోజ్‌ని ఉపయోగించి తయారు చేయబడిన పౌడర్-ఆధారిత ఎనర్జీ డ్రింక్. ఇది తక్షణ శక్తిని అందించడానికి రూపొందించబడింది మరియు సుదీర్ఘమైన రోజులో ఇంధనం నింపుకోవడానికి ఇది గొప్ప మార్గం. అవసరమైన విటమిన్లు మరియు ఎలక్ట్రోలైట్‌తో మెరుగుపరచబడింది. ఇది అధిక వేడిని తట్టుకోవడం, అలసటతో పోరాడటం మరియు అధిక గ్లూకోజ్ కంటెంట్‌తో మీ శక్తిని ఆప్టిమైజ్ చేయడంలో మీకు సహాయపడుతుంది. విటమిన్ సి మరియు కాల్షియం యొక్క మంచితనంతో సమృద్ధిగా ఉంటుంది, పిల్లలు మరియు పెద్దలు ఆరోగ్యంగా మరియు అవసరమైన పోషకాల శక్తితో చురుకుగా ఉండేలా చూసుకుంటారు. ఇది అనుకూలమైన సాచెట్‌లలో లభిస్తుంది మరియు బ్యాగ్‌లో లేదా జేబులో సులభంగా తీసుకెళ్లవచ్చు. డాబర్ ఇండియా లిమిటెడ్ గురించి: డాబర్ ఇండియా లిమిటెడ్ భారతదేశంలోని ప్రముఖ కంపెనీలలో ఒకటి. 140 సంవత్సరాల పాటు నాణ్యమైన మరియు అనుభవం యొక్క వారసత్వం ఆధారంగా, డాబర్ నేడు భారతదేశం యొక్క అత్యంత విశ్వసనీయ పేరు మరియు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుర్వేద మరియు సహజ ఆరోగ్య సంరక్షణ సంస్థ. డాబర్ ఇండియా యొక్క పోర్ట్‌ఫోలియోలో ఎనిమిది పవర్ బ్రాండ్‌లు ఉన్నాయి డాబర్ చ్యవన్‌ప్రాష్, డాబర్ హనీ, డాబర్ హొనిటస్, డాబర్ పుదిన్ హరా మరియు డాబర్ లాల్ టైల్ హెల్త్‌కేర్ స్పేస్‌లోబీ వ్యక్తిగత సంరక్షణ కోసం డాబర్ ఆమ్లా మరియు డాబర్ రెడ్ పేస్ట్‌బీ మరియు ఫుడ్ పానీయాల విభాగంలో రియల్.

### జయప్రద, రమ్యకృష్ణ, కాజల్ సందడి చేసిన జీ తెలుగు

# 19వ వార్షికోత్సవ వేడుక

### జీ మహోత్సవం ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు




**కర్నూలు, మే 16 (ఆంధ్రపత్రిక) :** 2023 తెలుగు టెలివిజన్ పరిశ్రమలో ప్రేక్షకులకు వినోదం పంచుతూ అగ్రగామిగా నిలుస్తున్న ఛానళ్లలో ఒకటి జీ తెలుగు. ఆసక్తికరమైన కథలతో, ఆకట్టుకునే కథనాలతో సాగుతున్న సీరియల్స్తో పాటు భిన్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న రియాలిటీ షోలు, ప్రత్యేక కార్యక్రమాలతో ప్రేక్షకులకు ఎనలేని వినోదాన్ని పంచుతున్న జీ తెలుగు విజయవంతంగా 19వ సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సరికొత్త కార్యక్రమాలతో అన్ని వయసుల ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా సాగుతున్న జీ తెలుగు 19 వసంతాల వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. తెలుగు టెలివిజన్ చరిత్రలో నూతన ఒరవడి సృష్టిస్తూ విజయపథంలో సాగుతున్న జీ తెలుగు19వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమం జీ మహోత్సవం మే 19న సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో మాత్రమే! తెలుగు ప్రేక్షకుల నుంచి అశేష ఆదరణ పొందుతూ విజయపథాన కొనసాగుతున్న జీ తెలుగు 19వ వార్షికోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఈ వేడుకలో జయప్రద, రమ్యకృష్ణ, కాజల్ అగర్వాల్ వంటి ప్రముఖ సెలబ్రిటీలు పాల్గొన్నారు. జీ తెలుగు 19 ఏళ్ల ప్రయాణం గురించి యాంకర్లు రవి, సిరి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సరదాగా సాగిన ఈవేడుకలో జూనియర్-సీనియర్ల మధ్య జరిగిన పోటీ ఆద్యంతం అలరిస్తుంది. సీనియర్ జట్టుకి జయప్రద, జూనియర్ జట్టుకి రమ్యకృష్ణ నాయకత్వం వహించారు. ఈ ఇద్దరి గ్రాండ్ ఎంట్రీతో ఘనంగా మొదలైన పోటీడ్రామా జూనియర్స్ అంత్యాక్షరి స్కిట్, 1980, 1990 దశకాల్లోని హీరో హీరోయిన్ల గెటప్లతో సాగిన ప్రదర్శనలతో ఆసక్తికరంగా సాగింది. టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ సర్ప్రైజ్ ఎంట్రీ జూనియర్ టీమ్లో మరింత ఉత్సాహం నింపింది. ఈవేదికపై డ్రామా జూనియర్స్ పిల్లల అద్భుత ప్రదర్శనతో కె.విశ్వనాథ్, చంద్రమోహన్, శరత్ బాబు వంటి తెలుగు సినిమా దిగ్గజ కళాకారులకు నివాళులు అర్పించారు. అనంతరం నటి జయప్రద, రమ్యకృష్ణ వారితో తమ వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకోవడంతో పాటు సినీపరిశ్రమలో వారు పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. సరదా సాయంకాలాన్ని మరింత వినోదంగా మారుస్తూ జూనియర్స్, సీనియర్స్ బృందం తల్లీ కొడుకులు, అక్కా చెల్లెళ్ల బంధాలను ప్రతిబింబించే అద్భుత ప్రదర్శనతో అలరించారు. రమ్యకృష్ణ నటించిన పాపులర్ చిత్రం అమ్మోరును జూనియర్ టీం రీక్రియేట్చేసింది. యష్మి, ఇతర జూనియర్ టీం సభ్యులు రమ్యకృష్ణ జీవిత ప్రయాణాన్ని వర్ణించే ప్రదర్శనతో అబ్బురపరిచారు. 80, 90, వర్తమానాల్లో ఆల్ టైమ్ ఫేవరెట్హిట్స్ అయిన ప్రముఖ జీ తెలుగు షో సరిగమపలోని పాటలను సీనియర్లు, జూనియర్లు ఆలపించారు. వైభవంగా జరిగిన ఈ కార్యక్రమం పాత, కొత్త, గతం, వర్తమానాన్ని ఏకతాటిపైకి తెచ్చింది. ఈ వేడుక జీ తెలుగు 19 సవంవత్సరాల విజయవంతమైన ప్రయాణానికి ప్రతీకగా నిలిచింది.

# ఓట్ల లెక్కింపుకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు




**విజయవాడ, మే 16 (ఆంధ్రపత్రిక) :** ఓట్ల లెక్కింపుకు అధికారులు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు అన్నారు. జూన్ 4వ తేదీన చేపట్టే ఓట్ల లెక్కింపుకు చేపట్టవలసిన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ లో కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమిష్టి కృషితో జిల్లాలో పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని ఇదే స్పూర్తిని లెక్కింపు ప్రక్రియలోను కొనసాగించి విజయవంతం చేయాలన్నారు. ఇబ్రహీంపట్నం జూపూడి లోని నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడు అంచెల భద్రత ఉందన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ లు, సీల్ వేసిన డోర్‌లు, సెక్యూరిటీ, కారిడార్లను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేసిన సీసీ కెమెరాలు, భద్రత పర్యవేక్షణపై నియమించిన గెజిటెడ్ అధికారులు, పోలీసు అధికారులు 24 గంటలు అప్రమత్తంగా వుండాలన్నారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద నుండి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు పోలింగ్ యంత్రాలు తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి వేరు వేరు మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యారికెడ్లు ఏర్పాటు చేయాలని ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని సూచనలు చేశారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అన్నారు. లెక్కింపు కేంద్రంలో అసెంబ్లీకి, పార్లమెంటుకు ఒక్కొక్క దానికి 14 టేబుల్స్ చొప్పున 28 టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ చేపట్టాకే ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ఖచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు.సమావేశంలో డిఆర్ఓ వి. శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మి ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ ఎం దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

### నెక్స్ట్ జనరేషన్ ఏఐ ఇన్వర్టర్ కంప్రెసర్ టెక్నాలజీతో

# శామ్‌సంగ్ రిఫ్రిజిరేటర్లు



**విజయవాడ, మే 16 (ఆంధ్రపత్రిక) :** భారతదేశపు ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, వినియోగదారుల కోసం అనుకూలీకరించదగిన ఎంపికలను అందించడం ద్వారా భారతీయ గృహాల జీవనశైలిని మెరుగుపరిచే లక్ష్యంతో మూడు కొత్త రిఫ్రిజిరేటర్‌లను ఆవిష్కరించింది. ఈ కొత్త రిఫ్రిజిరేటర్‌లు శామ్‌సంగ్ యొక్క తాజా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-పవర్డ్ ఇన్వర్టర్ కంప్రెసర్ టెక్నాలజీతో అమర్చబడి ఉన్నాయి. శామ్‌సంగ్ యొక్క కొత్త రిఫ్రిజిరేటర్లలో ఏఐ ఇన్వర్టర్ కంప్రెసర్, మోటారు, శక్తి సామర్థ్యాన్ని ఆప్టిమైజ్ చేయడం కొరకు సాంప్రదాయ అంతర్గత డిజైన్‌లో విప్లవాత్మక మార్పులు చేస్తుంది. తద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గుతాయి.

### 19న ఎల్వీపీఈఐ ఆధ్వర్యంలో

# వైట్‌థాన్ వాక్

### - గవర్నర్ చేతుల మీదుగా టి-షర్టు ఆవిష్కరణ




**విజయవాడ మే 16 (ఆంధ్రపత్రిక) :** ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వీపీఈఐ) ఆధ్వర్యంలో విజయవాడ లోనికోడే వెంకటాద్రి చౌదరి క్యాంపస్, తాడిగడప వద్ద మే 19వ తేదీన వైట్‌థాన్ వాక్ ను నిర్వహించనున్నట్టు ఆ ఆసుపత్రి వైద్యులు ఓక్యులర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ అనసూయ కపూర్, యలమంచిలి కంటి కేన్సర్ సెంటర్ హెడ్ డాక్టర్ హిమబిందు తెలిపారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వైట్‌థాన్ వాక్ టీ షర్ట్ ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్ కు సంబంధించి అవగాహన కల్పించుటకు గత రెండు సంవత్సరాలుగా ప్రతి ఏడాది వైట్‌థాన్ పేరిట పరుగు/నడక (రన్నింగ్/వాక్) కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కంటి క్యాన్సర్ అత్యంత ఖరీదుతో దీర్ఘకాలం నిర్వర్తించవలసిన చికిత్స అని, అందువలన ఈ 'వైటాథాన్' నడక ద్వారా సేకరించిన విరాళాలు రెటినోబ్లాస్టోమా చికిత్స అవసరమైన ఆర్థిక స్థితిలేని పిల్లలకు ఉచిత చికిత్స అందించుటకు, ఈవ్యాధి పై పరిశోధనలకు ఉపయోగిస్తున్నామన్నారు. 'వైటాథాన్' ద్వారా సేకరించిన నిధులు ఎల్విపిఈఐ నందు రెటినోబ్లాస్టోమా కంటి క్యాన్సర్‌తో బాధపడుతున్న 2000 పైబడిన పిల్లలకు చికిత్స అందించుటకు ఉపయోగించమన్నారు. ఈ వైట్‌థాన్ వాక్ ఎల్ వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వద్ద ప్రారంభించి 5 కి.మీ, 3 కి.మీ నడక కార్యక్రమం రెండు క్యాటగిరులలో నిర్వహిస్తామన్నారు. సాధారణంగా రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్ 3 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందనీ, ఈ వ్యాధిని సకాలంలో గుర్తించుటలో జాప్యం సరియైన చికిత్స అందకపోవటం వలన చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. రెటినోబ్లాస్టోమాను ముందుగానే గుర్తించి, చికిత్స చేస్తే, పిల్లల జీవితం, కాంతిని దృష్టిని కాపాడవచ్చుననీ తెలిపారు.

# జన్మదినం సందర్భంగా అన్నదానం



**పొన్నూరు మే 16 ఆంధ్రపత్రిక :** పుట్టినరోజు అనేది ఆనందంగా జరుపుకునే పండుగ అని కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ విజయకుమార్ అన్నారు.గురువారం లేఖన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిట్టి పుట్టినరోజు సందర్భంగా వారి స్నేహితులు అంకిత ఆదరణ ఫౌండేషన్ అనాధాశ్రమం నిస్సి హరణి తరపున అన్నదానం నిర్వహించారు. నిరుపేద కుటుంబాల పేద పిల్లలందరికీ, పెద్ద వాళ్ళకి చిట్టి పుట్టిన సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదానం చేయడం జరిగింది. పుట్టినరోజు సంబరాలు చేసుకోవడం కన్నా.... పేదవారి ఆకలి తీర్చడం సంతోషమని అన్నారు. అన్నదానం చేయడానికి ముందుకొచ్చిన లేఖన ఫౌండేషన్ వారికి కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున చిట్టి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దేవుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో దీవెనలు సమృద్ధిగా కలగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమం చేయడానికి ప్రోత్సహించిన నిస్సి హరణి కృతజ్ఞతలు తెలియజేసారు. ఎంతో సంతోషం మరియు ఈ కార్యక్రమంలో కెవిఆర్ ట్రస్ట్ సభ్యులు రాజేష్, ఆశీర్వాదం, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

### ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం




**గుంటూరు : మే 16 (ఆంధ్రపత్రిక)** ఈనెల 15 తో అన్ని విద్యాసంస్థలకు స్కూల్ మరియు కాలేజ్ బస్సులకు ఫిట్నెస్ గడువు మే 15 తారీకు తో ముగిసినది. జిల్లా వ్యాప్తంగా 1500 పైగా పాఠశాలాల, కళాశాలాల బస్సులు ఉన్నాయి. ఏపీయంవి 185(%+%) ప్రకారం కచ్చితంగా 32 నిబంధనలను ప్రతి స్కూలు, కళాశాల యజమానులు పాటించాలని గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం సూచించారు స్కూల్ బస్సు డ్రైవర్కు 60 సంవత్సరాలు వయో పరిమితి దాటిన వ్యక్తి అనర్హుడు. డ్రైవర్కు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఖచ్చితం ఆరోగ్య పరీక్షలు ఆయా యాజమాన్యాలు విధిగా చేయించి, ఆ రికార్డులను భద్రపరచాలి. డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీఓ అధికారులకు తెలియజేయటంతో పాటు, 5 సంవత్సరాల అనుభ వం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. కళాశాల, స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదం డ్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయటంతో పాటు, ప్రతి నెలా వాహనానికి సంబంధించి స్థితిగతులను రిజిష్టర్ చేయటంతో పాటు, ప్రతి వాహనంలో ఫిర్యాదు పుస్తకాన్ని ఉంచాలి. బస్సులు బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరుచు కునే బాక్సులు సబ్రూల్ 'ఏ', 'బి' ప్రకారం తప్పని సరిగా ఉండాలి అని కావున అన్ని విద్యాసంస్థలు యజమాన్యాలు తప్పక వాహనాలకు సరైన కండిషన్లో ఉంచుకొని పై సూచించిన 185(+%) నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తమ యొక్క వాహనాలకు ఫిట్నెస్ పొందాలని గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీంఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్నెస్ లేని వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో కూడా తిప్పరాదు అని, అలా ఫిట్నెస్ లేని రోడ్డుపై తిరుగుతూ పట్టుబడిన బస్సులను సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని, కావున పాఠశాలలకు మరి కళాశాలకు పై ప్రకటించిన రూల్ ప్రకారం అన్ని వాహనాలు ఫిట్నెస్ పొందాలని తెలిపారు.

### యువతలో సామాజిక, సాంస్కృతిక

# విజ్ఞాన అభ్యుదయ భావాలు పెరగాలి



**బాపట్ల మే 16 (ఆంధ్రపత్రిక) :** ఉన్నత సమాజ నిర్మాణం కోసం సామాన్యులకు సామాజిక సాంస్కృతిక చైతన్యం, అభ్యుదయ భావాలు పెరగాలని ఊరూర జన విజ్ఞానం రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి కోరారు. వెదుళ్ళపల్లి చైతన్య భవన్లో నెలనెలా జరిగే విజ్ఞాన సమీక్ష సమావేశం లో భాగంగా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశానికి జన విజ్ఞాన వేదిక సాంస్కృత విభాగం నాయకులు ఆసోది శంకర్ అధ్యక్ష వహించి మాట్లాడుతూ నేటి యువత మహాకవులు తత్వవేత్తలు రచించిన గ్రంథాలను పుస్తకాలను అధ్యయనం చేయాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణ సామాజిక శాస్త్రాలు అధ్యయనం చేయవలసిన అవసరం ఉందన్నారు. నేటి యువత ప్రధానంగా సైన్సు, సాంకేతిక శాస్త్ర అవగాహనతో పాటు సినిమా, టీవీ ,మీడియా సాంకేతిక పొందుతున్నారు అయితే మానవ సమాజ పురోగతిలో భాగంగా నీటి ఆధునిక సామాజిక శాస్త్రాలను కూడా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది కాపాడు కోవటం అందరి కర్తవ్యం అని కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఈ సమీక్షా సమావేశం లో ఆ సోది శంకర్ రెడ్డి ఎస్ కె సుభాని, కె.వి.నారాయణ, ప్రదీప్, సిద్దు, కుమార్, అవినాష్ , సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియకు

# పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

### కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్



**గుంటూరు : మే 16 (ఆంధ్రపత్రిక) :** సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి రిటర్నింగ్ అధికారులను సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి, మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరియు సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ , గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్త చేకూరి లతో కలసి ఓట్లు లెక్కింపు ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆచార్య నాగర్జున యూనివర్సిటీలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన భవనాల్లో కౌంటింగ్ కు సంబంధించిన టేబుళ్ళు, బారికేటింగ్, సీసీ కెమేరాల ఏర్పాట్లు, అవసరమైన ఇతర సౌకర్యాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులు నిరంతరం పరిశీలించి, వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కౌటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ర్యాండమైజేషన్ ప్రక్రియలు సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ రోజు టేబుళ్ల వారీగా, రౌండ్ల వారీగా వివరాలు జిల్లా ఎన్నికల అధికారికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన సిబ్బందిని, కంప్యూటర్లు, ఇంటర్ నెట్ తదితర సౌకర్యాలను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్దిరోజా, ప్రత్తిపాడు రిటర్నింగ్ అధికారి ఆర్ డిఓపి. శ్రీఖర్ , తాడికొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు , పొన్నూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి ,పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరియు జియంసి అదనపు కమిషనర్ కె. రాజ్యలక్ష్మీ , డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కె స్వాతి పాల్గొన్నారు.

# పాఠశాలకు ఇన్సినెరేటర్ బహుకరణ



**ఆగిరిపల్లి, మే 16 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలోని ఫ్రీ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు జి అపర్ణ ప్రోత్బలంతో నున్న పవర్ గ్రిడ్ యాజమాన్యం వారు ఇన్సినెరేటర్ వితరణ చేశారు .దీని ద్వారా డిస్పోజల్ సానిటరీ నాప్కిన్స్ తయారు చేయవచ్చునని తెలిపారు .ఈ పవర్ గ్రిడ్ వారు గతంలో కూడా స్కూలుకు ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ సౌజన్యంతో గతంలో కూడా పలు ద ఫాలుగా ఏదో రూపేణా సాయం చేస్తున్నారు అని తెలిపారు . ఈ సందర్భంగా పవర్ గ్రిడ్ యాజమాన్యం వారికి జరిగిన సన్మాన కార్యక్రమంలో పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కె నాగమోహనరావు ,డిప్యూటీ మేనేజర్ శివ నాగేశ్వరరావు ,టెక్నీషియన్ కే శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది ,గ్రామస్తులు, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని పవర్ గ్రిడ్ యాజమాన్యాన్ని అభినందించారు.

## స్ట్రాంగ్ రూములను
# ఆకస్మికంగా తనిఖీ

**- జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు**



**హిందూపురం, మే 16 (ఆంధ్ర పత్రిక) :** సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను ఆయా స్ట్రాంగ్ రూములకు చేర్చి మూడెంచెల భద్రతను పటిష్టం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. గురువారం మధ్యాహ్నం హిందూపురం పట్టణ సమీపంలో బిట్ కళాశాల, లేపాక్షి చోళ సముద్రం వద్దనున్న డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూముల వద్ద ప్రస్తుత పరిస్థితులను,భద్రత చర్యలను, విధులు నిర్వర్తిస్తున్న వారి పనితీరును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం కౌంటింగ్ ల ప్రక్రియను రెండు కేంద్రాల్లో చేపట్టినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ ల్లో ఈవీఎంలను ఉంచి మూడంచెల భద్రతను ఏర్పాటు చేయడం జరిగింది. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్ డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు 24 గంటల పాటు రక్షణగా ఉండేలా ఏర్పాటు చేశారు. వీరితో పాటు కంట్రోల్ యూనిట్లను నిరంతరం పర్య వేక్షించేందుకు సీసీ కెమెరాలు అమర్చారు. భద్రత వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశారు.జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో డీఎస్పీ స్థాయి అధికారులు, ఇతర పోలీస్, ఉద్యోగ సిబ్బంది ఆధ్వర్యంలో 24 గంటలు విధులు ఆ కౌంటింగ్ సెంటర్లలో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అనంతరం స్ట్రాంగ్ రూములను పరిశీలించిన తర్వాత సంబంధిత ఆర్ . ఓ. లకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలను ఎవరు కూడా అతిక్రమించరాదని కౌంటింగ్ సెంటర్ ల ప్రాంతాలలో 144 సెక్షన్ అమల్లో ఉందని నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా కౌంటింగ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న వారు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని,పోలీస్ శాఖ నేతృత్వంలో గట్టి బందోబస్తు చేపట్టాలని, చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకు కూడా తావివ్వరాదన్నారు. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్ రూముల తనిఖీలలో భాగంగా ఈవీఎం గదులను పరిశీలించి సంబంధిత అధికారులకు సీసీ కెమెరాల పనితీరు, పోలీసు పహారా నిరంతర విద్యుత్ సరఫరా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తదితర అంశాలపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అలాగే కమాండ్ కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన తర్వాత విజిటర్స్ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు.ఈ కార్యక్రమంలో హిందూపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ, ధర్మవరం రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి, మడకశిర రిటర్నింగ్ అధికారి గౌరీ శంకర్, హిందూపురం డి ఎస్ పి కంజక్షన్, సి ఐ ఈరన్న, పెనుకొండ తహసీల్దార్ ఉదయ శంకర్, చిలమత్తూర్ తహసీల్దార్ భాగ్య లత, మడకశిర తహసీల్దార్ వెంకటేష్, ఆర్ ఐ అమర్, ఎస్ఐ గోపి, తహసిల్దార్లు,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం..



**సోమల,మే 16 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధి సోమల మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో డా.జయసింహ, డా బాలాజీ,డా విజయ లక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని రోగ గ్రస్తులకు ముందస్తు నివారణకు ఇంజెక్షన్‌లను వేశారు.ఈ క్రమంలో వారు మాట్లాడుతూ 2025కు క్షయ వ్యాధిని రూపు మపడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో బాగంగా మండలంలోని దూమపానం, మద్యం, టోబోకో సేవించే వారు, షుగర్ ,బి.పి వారిని గుర్తించడం వారికి ప్రతి గురువారం ప్రతి సచివాలయంలో కనీసం 70 మందికి ఇంజెక్షన్‌లు వేసే విదంగా కార్యక్రమాలను రూపొందించారు.కావున మండలంలో క్షయ వ్యాధి నిర్మూలకు ప్రతి ఒక్క రూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అమరనాథ్, స్టాఫ్ నర్సులు, ఏ.ఎన్. ఎం.లు అశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ డెంగ్యూ వ్యాధి నిరోధక దినోత్సవం



**సోమల,మే 16 (ఆంధ్రపత్రిక):**చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సోమల మండలం లోప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూ వ్యాధి నివారణ కార్యక్రమంను డా జయసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు ననుసరించి ముందస్తు చర్యలలో భాగంగా ప్రజలు వ్యాధినిరోధక ఇంజెక్షన్ల వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ .ఓ. శివ రత్నమ్మ ,అమరనాథ్ ,ఉషారాణి రోజ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి
# మూలింటివారు విరాళం అందజేత



**హిందూపురం, మే16 (ఆంధ్ర పత్రిక):** మునిసిపల్ పరిధిలోని సూగూరు సడ్లపల్లి గ్రామంలో అతి పురాణతమైన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణ సహాయార్థం కొరకు కీ.శే. మూలింటి కొండారెడ్డి కుమారులు,వారి కుటుంబ సభ్యులు రూ.1,00,999 రూపాయలు విరాళంగా అందించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా అతి పురాణతమైన దేవాలయాన్ని తిరిగి పునర్నిర్మానం చేయాలని గ్రామస్తులు సంకల్పించడంతో ఇందుకు మూలింటివారు హర్షం వ్యక్తం చేస్తూ కీ. శే.మూలింటి తిమ్మారెడ్డి, నారాయణరెడ్డి, వీరి సోదరులు రామిరెడ్డి,గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులకు రూ.1,00,999 రూపాయల విరాళంగా అందించారు. ఆలయ నిర్మాణానికి భారీగా విరాళం అందించిన మూలింటి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,బాలకృష్ణ రెడ్డి, బాలాజీతో పాటు ఆలయ కమిటీ సభ్యులు శివారెడ్డి, గోవింద్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ గోవిందరాజస్వామి
# బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**తిరుమల, మే 16(ఆంధ్రపత్రిక) :** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం 8.15 నుండి 8.40 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీవారి ఆస్థానం ఘనంగా జరిగింది. అంతకుముందు శ్రీ గోవింద రాజ స్వామివారు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. ఈ ఊరేగింపు ద్వారా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ముందుగా పర్యవేక్షి స్తారని ప్రతీతి. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తు హెూమం, గరుడ లింగహెూమం, గరుడ ప్రతిష్ట , రక్షా బంధనం చేపట్టారు. మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవింద రాజస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం ధ్వజారోహణం ఉద్దేశం. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామి ఉత్సవర్లకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందు లో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహన సేవ శాస్త్రోక్తం గా



జరిగాయి. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, సిఈ నాగేశ్వరరావు, ఎస్ ఇ -2 జగదీశ్వర్ రెడ్డి, ఆగమ సలహా దారులు సీతారామా చార్యులు, మోహన రంగాచార్యులు, ఆల య



డెప్యూ టీ ఇఓ శాంతి, కంకణభట్టార్ ఎ.నారాయణ దీక్షితులు, సూపరిం టెండెంట్ మోహన రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు పాల్గొన్నారు.

## మండల నాయకులు,
# కార్యకర్తలు,ప్రజలకు కృతజ్ఞతలు

**- బీవీ జయనాగేశ్వరరెడ్డి**



**నందవరం, మే 16 (ఆంధ్రపత్రిక):** ఎమ్మిగనూరు నియోజకవర్గ ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి గురువారం రోజున నందవరం మండల పర్యటన చేశారు.పర్యటనలో భాగంగా నందవరం,మాచాపురం,ఇబ్రహీంపురం మరియు పలుగ్రామాలలో టిడిపి నాయకులను వాళ్ల గృహాలకు వెళ్లి మండలంలో ఎన్నికలలో జరిగిన పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. టిడిపి నాయకులు బీవీజయ నాగేశ్వర రెడ్డికి శాలువా కప్పి సత్కరించి స్వాగతించారు. అనంతరం విలేకరుల సమావేశంలో బీవీ జయ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతు నందవరం మండలంలో పోలింగ్ శాతం పెరిగింద న్నారు. భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాల కు తరలివచ్చి ఓట్లను వేసి మండలంలో ఎప్పుడు లేని విధంగా పోలింగ్ శాతాన్ని నమోదు చేయడం జరిగిందన్నారు.అందుకు నందవరం మండల ప్రజానీకానికి పత్రికా ముఖంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ అరాచక పాలన మొదలైనప్పటి నుండి పోలింగ్ తేదీ వరకు వైసీపీ ఆగడాలకు ఎదురుగా నిలిచి నావెంటనడుస్తు నాకు అండగా నిలిచిన నందవరం మండలం టిడిపి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ప్రచారంలో మాకు తోడుగా,అండగా నిలిచిన బిజెపి,జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రచారంలో ముఖ్య పాత్ర పోషించి పార్టీకి వెన్నెముకగా ఉన్న టిడిపి కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.130 సీట్లకు పైగా భారీ మెజార్టీతో గెలిచి ఉమ్మడి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని జోష్యం చెప్పారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడ్డాక పార్టీకి అండగా నడిచిన ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీ తోడుగా ఉంటుందని బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు.

# నేడే మండల సాధారణ సర్వసభ్య సమావేశం

**సోమల, మే 16(ఆంధ్ర పత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సోమల మండలంలో శుక్రవారం ఉదయం 11 గం.లకు ఎం.పి.పి.ఈశ్వరయ్య అధ్యక్షత న సాధారణ సర్వ సభ్య సమావేశంను మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని మండల అభివృద్ధి అధికారి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ తమ పరిధిలోని గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాల నివేదికలు ను పూర్తి సమాచారంతో సమావేశంకు హాజరు కావాలని కోరారు.

# నూతన కమిటీ ఎన్నిక



**గూడూరు, ఆంధ్ర పత్రిక:** వై.జె.పి లయన్స్ క్లబ్ 2024-25 సంవత్సరానికి క్లబ్ నూతన కమిటీ నీ ఎన్నిక చేశారు. వై.జె.పి లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా పి.వి.మనోజ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లో క్లబ్ తరపున పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. దాతల సహకారం మరువలేనిదన్నారు.అనంతరం గూడూరు టౌన్ క్లబ్ అధ్యక్షుడుగా సుబ్రహ్మణ్యం ను ఎంపిక చేశారు.అనంతరం నూతన కమిటీ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, వేణు రెడ్డి, మురళి రాజు, వెల్లేటి వెంకటరామిరెడ్డి, గోపీనాథ్ రెడ్డి ఎస్ ఎల్ ఎన్ స్వామి, పసుపులేటి ప్రసాద్, రాజేంద్రప్రసాద్, పీవీ శివరాం, బండ్ల సుధాకర్, బండ్ల హరికృష్ణ, శీను, మురళి నాయుడు, గురునాథం షేక్ బషీర్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అక్రమ మద్యం స్వాధీనం



**నందవరం, మే 16 (ఆంధ్ర పత్రిక):** మండల పరిధిలోని నాగలదిన్నె చెక్ పోస్ట్ దగ్గర తెలంగాణ రాష్ట్రం నుండి అక్రమంగా మద్యాన్ని తీసుకు వెళ్తున్న సోమలగూడూరు గ్రామానికి చెందిన కురవరాజును అరెస్టుచేసి మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఆ వ్యక్తి దగ్గర 245 మధ్యం బాటిల్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిమ్మయ్య తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్సై తిమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# షష్టిపూర్తి వేడుకల్లో పాల్గొన్న అమ్మఒడి పౌండర్



**బంగారుపాళ్యం-మే 16(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి మండలం, ఐరాల క్రాస్ వద్ద ఉన్న శ్రీ వినాయక విద్యామందిర్ అధినేత ఆర్ గణపతి నాయుడు, ఇంద్రాణి(60 వ సంవత్సరం) షష్టిపూర్తి వివాహ మహెూత్సవం వైభవంగా జరిగినది.ఈ కార్యక్రమానికి అమ్మఒడి ట్రస్ట్ ఫౌండర్,చెరుకూరి పద్మనాభనాయుడు దంపతులు విచ్చేసి షష్టిపూర్తి చేసుకుంటున్న దంపతులను ఆశీర్వించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీజీ టీకాలతో క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం



**చౌడేపల్లి,మే16(ఆంధ్రపత్రిక):** బీసీజీ టీకాలు వేయించుకొని క్షయ వ్యాధినీ నిర్మూలిదామని వైద్యాధి కారిని పూజ అన్నారు. క్షయ వ్యాధి రాకుండా, క్షయ వ్యాధి వచ్చి నయం అయిన వారికి, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, షుగర్ వ్యాధితో బాధపడు తున్న వారికి, పొగ త్రాగే అలవాటు ఉన్నవారి కి, 60 సంవత్సరాల పైబడి బిపి లేని వారికి, ప్రతి గురువారం, ఎమ్మెల్ పీహెచ్ఈఓలు,ఏఎన్ఎం, ఆశాలు బీసీజీ టీకా వేయడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ బీసీజీ టీకా వేసుకొని, క్షయ వ్యాధి రాకుండా నివారించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లద్దిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రవీణ్, నవీన్ చౌడేపల్లి లద్దిగం ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయ నియంత్రణలో భాగంగా
# అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమం



**కలిగిరి,మే16 (ఆంధ్ర పత్రిక):** జాతీయ టీ.బి (క్షయ నియత్రణ) కార్యక్రమంలో బాగాంగ, టీ.బి వ్యాధి నివారణ కోసం, 16-05-2024 నుండి అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ప్రతి గురువారం బి సీ జీ వాక్సినేషన్ డేగా నిర్ణయించి అర్హులు ఐన వారు అందరికీ బిసిజి వాక్సిన్ వేయడం జరుగుతుంది. ప్రభుత్వం వారు ఇచ్చిన ఈ మార్గ దర్శకాల ప్రకారం 60సం " పైబడిన వారికి షుగర్ వ్యాది గ్రస్తులులకు 5 సంలలో ఉన్న TB కేసులకి, వారి కుటుంబ సభ్యులకు పొగ త్రాగడం అలవాటు ఉన్న వారికి BMI తక్కువగా ఉన్న వారికి.ఇలా అర్హులు ఐన అందరికీ వాక్సిన్ వేయడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. గీతా రెడ్డి, కలిగిరి మండల అభివృద్ధి అధికారి రంగ సుబ్బరాయుడు, కలిగిరి పంచాయితీ కార్యదర్శులు, కలిగిరి ఉపకేంద్రం ఆరోగ్య సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఎన్డీఏ కూటమిదే విజయం..



**గూడూరు,మే 16 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో వైసిపి పాలన,అవినీతిమయమైపోయింని, ప్రజలు మార్పు కోరుకుం టున్నారని, ఎన్నికల్లో వైసీపీ నాయకుల దౌర్జన్యాలు అంతులేకుండా పోయాయని, తిరుపతి బిజెపి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో తిరుపతి బీజేపీ ఎంపి అభ్యర్థి వెలగ పల్లి వరప్రసాద్ రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు, మయం అయిపోయిందని పేర్కొన్నారు., చిల్లకూరు మండలంలో సిలికా అక్రమ రవాణా వల్ల వ్యవసాయ భూములు పేదల నివాసా లు పోతున్నాయని, అనేకసార్లు ముఖ్యమంత్రి తెలియజేసిన పట్టించుకోలేదని అన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే సిలికా అక్రమ రవాణాను అరికడతామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో చిల్లకూరు మండలంలో వైసీపీ నాయకుల టిడిపి నాయకులపై దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, పురుషోత్తం రెడ్డి, బిల్లు చెంచురామయ్య, బాలకృష్ణ నాయుడు, వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో
# తాగునీటి సమస్య లేకుండా చూడండి

**తొట్టంబేడు ఎంపీడీవో ఐ జాక్ ప్రవీణ్**



**తొట్టంబేడు,మే 16 (ఆంధ్రపత్రిక):** గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చూడండినీ తొట్టంబేడు ఎంపీడీవో ఐ జాక్ ప్రవీణ్ అన్నారు.గ్రామాలలో త్రాగునీటి సమస్యలు లేకుండా గ్రామ పంచాయతీ సర్పంచుల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ఈవో ఆర్ డి, ట్రాన్స్కో ఏ ఈ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. వర్షాలు పడేంత వరకు గ్రామాలలో ఎటువంటి కొరత లేకుండా జాగ్రత్త వహిస్తూ మోటార్ రిపేర్లు, పైప్లైన్ రిపేర్లు, బోరింగ్ మరమ్మత్తులు వెంటనే పూర్తి చేస్తూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. నీటి సరఫరాకు సంబంధించి ట్రాన్స్ఫార్మర్ రిపేర్లు కానీ, ఇతర ఎలక్ట్రిసిటీకి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని ట్రాన్స్కో ఏ ఈకి ఈ సందర్భంగా కార్యదర్శులను కోరారు. ఈ ఓ ఆర్ డి తరునాక్షి రెడ్డి మాట్లాడుతూ అత్యవసర రిపేర్లకు గ్రామపంచాయతీలోని 15 ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు వినియోగించి చర్యలు చేపట్టవచ్చునని తెలిపారు. అదేవిధంగా ఇంటి పన్ను వసూలు నూరు శాతం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించి తాగునీటి సరఫరాలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే ఇంజనీరింగ్ అధికారుల ద్వారా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. నీటి పొదుపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అదేవిధంగా సచివాల య సిబ్బంది బయో మెట్రిక్ హాజరు నూరు శాతం ఉండేలాగా ఆయా సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలియజేశారు. అందరూ పంచాయతీ కార్య దర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పథకాల లబ్ధిదారులకు
# 14వేల165కోట్లు వెంటనే చెల్లించాలి




**గుంటూరు,మే 16(ఆంధ్ర పత్రిక):** ఎన్నికల ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి హడావిడి చేసి ఎన్నికల లబ్ధిదారులకు 14 వేల 165 కోట్లు వెంటనే చెల్లించడానికి ప్రయత్నించారని ఎన్నికల సంఘం ఎన్నికల అనంతరం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించినా ఇప్పటివరకు ఆ వైపు దృష్టి మళ్లించలేదని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి తెలిపారు. ఈనెల 16వ తేదీ ఉదయం గుంటూరులో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ప్రసంగించారు. దాదాపు 82% ఓటింగ్ జరగడం ఆంధ్రప్రదేశ్లో మొదటిసారి అని దేశవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం ఆంధ్రప్రదేశ్లో జరిగిందని వివరించారు. చెదురుముదురు సంఘ టనలు మినహా అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని ఒక్క రీపోలింగ్ జరగాల్సిన అవసరం రాలేదన్నారు. ఎన్నికల అనంతరం చంద్రగిరి, మాచర్ల, గురజాల, తాడిపత్రి ప్రాంతాలలో జరుగుతు న్న ఘర్షణలను నివారించడంలో పోలీసు యంత్రాంగం విఫలం అయిందన్నారు. భారతదేశం లోని అత్యధిక ఎన్నికల వ్యయం జరిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ కనబడుతుందని అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులు కలిసి దాదాపు 30 వేల కోట్లు ఖర్చు చేశారని అంచనా వేస్తున్నామన్నారు.

ఓటర్ల జాబితాను నిరంతరం ప్రక్షాళన చేస్తూ కొత్త ఓటర్లను చేరుస్తూ మరణించిన వారి ఓట్లను డబుల్ ఎంట్రీలను తీసివేస్తూ ఉంటే ఓటింగ్ శాతం మరింత పెరిగేదన్నారు. ఒకే ఇంట్లోని ఓట్లు ఒకే పోలింగ్ బూత్లో కాకుండా వివిధ పోలింగ్ బూత్లలో ఉండడం వలన వీఓట ర్లు ఇబ్బంది పడ్డారన్నారు. 60 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్స్కు ప్రత్యేక క్యూ ఉంటే బాగుండే దన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఓటింగ్ శాతం పెరగడానికి ప్రధానంగా పట్టణ ఓటింగ్ శాతం పెరగడానికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ గత ఆరు నెలలుగా చేసిన కృషి ఫలించిందన్నారు. సదస్సులు ,రౌండ్ టేబుల్ సమావేశాలు, కళా యాత్రలు ద్వారా ఓటర్లను జాగృతులను చేసామన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ లోని పౌర సంస్థలు, ప్రజాసంఘాలు, మేధావులను కలుపుకొని బలమైన పౌర వేదికను నిర్మిస్తామని తెలిపారు. గెలిచిన అభ్యర్థులు రాజకీయ అవినీతికి పాల్పడకుండా ఉండేటట్లు రాజకీయ అవినీతిపై సహజ వనరుల దోపిడీపై బలమైన పౌర సమాజం పోరాడాలన్నారు. అలా చేయడం ద్వారానే భవిష్యత్తులో ఎన్నికల వ్యయం తగ్గి మంచి అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండగలరన్నారు.రంగం ప్రజా సంస్కృతిక వేదిక కన్వీనర్ ఆర్.రాజేష్ ఓటు ప్రాధాన్యతని తెలియజేస్తూ పాటలతో సభికులను అలరించారు.పల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సంయుక్త కార్యదర్శి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ, పి.వి. మల్లికార్జునరావు ఏపీ ఎన్నికల నిఘా వేదిక గుంటూరు జిల్లా కార్యదర్శి, ప్రొఫెసర్ ఎన్.అరవింద్ అధ్యక్షులు, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, డా"ప్రత్యూష సుబ్బారావు ప్రముఖ సైకాలజిస్ట్, బత్తుల కృష్ణయ్య స్టెప్ అధ్యక్షులు.మీడియా సమావేశంలో ప్రసంగించారు.

# శ్రీ గురుదక్షిణామూర్తికి విశేష అభిషేకాలు





**శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్ర పత్రిక):** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం సందర్భంగా శ్రీ మేధా గురు దక్షిణామూర్తి స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్త మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు దేవస్థాన అధికారులు దేవస్థానం ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండ అగ్నిప్రమాదంలో
# రికార్డులు పదిలమేనా..

**చౌడేపల్లి,మే16(ఆంధ్రపత్రిక):** శక్తి క్షేత్రం బోయకొండ పై రెండు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆలయానికి చెందిన రికార్డులన్నీ పదిలంగా ఉన్నాయని బోయకొండ మాజీ చైర్మన్ ఎస్ కె వెంకట రమణారెడ్డి, ప్రశ్నించారు. పరిపాలన భవనంలో అగ్ని ప్రమాద తీరు పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రమాదం సంభవిస్తే సంబంధిత అగ్నిమాపక కేంద్రం ఫోరానిక్స్ ద్వారా పరిశీలన చేయించి జరిగిన తీరును వివరించాలన్నారు. అలాకాకుండా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిందని అధికారులు మరి కొందరు పిడుగు పడిందని వెల్లడించి, వెంటనే కార్యాలయాన్ని శుభ్ర పరచడం వెనక ఆంతర్యం ఏమిటని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల బోయకొండపై కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని అంతేకాకుండా పలు జమ ఖర్చులు ఉంటాయన్నారు. అలాంటి రికార్డులన్నీ కంప్యూటర్లు పేపర్ల రూపంలో భద్రపరిచి ఉంటారని, అగ్నిప్రమాదంలో ఆ రికార్డులన్నీ భద్రంగా ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రస్థాయి పూనతాధికారులు స్పందించి బోయకొండపై జరిగిన అగ్ని ప్రమాద సంఘటనపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

# రైల్వే గేటు తాత్కాలిక తొలగింపునకు వినతి



**కుప్పం,మే 16 (ఆంధ్రపత్రిక):** అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా కొత్తపేట రైల్వే గేటు గోడ తాత్కాలికంగా తొలగింపునకు అనుమతికోరుతూ అసిస్టెంట్డి విజినల్ ఇంజనీర్కి వినతి పత్రం ఇస్తున్న జగదీష్ బాబు, హంస సోమశేఖర్.కుప్పం ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా 21, 22వ తేదీలలో అమ్మవారి శిరస్సు ఊరేగింపులో భాగంగా కొత్తపేట రైల్వేగేటుకు ఉన్న గోడను తాత్కాలికంగా రెండు రోజులపాటు తొలగించాలని సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగధీష్ బాబు, 13వ వార్డు కౌన్సిలర్ హంస సోమశేఖర్ గురువారం రైల్వే అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ ఉన్నతాధికారులతో సంప్రదించి అనుమతి మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇవ్వటం జరిగింది.

# మళ్లీ గాడ్రించిన గజరాజు



**వి.కోట, మే16(ఆంధ్ర పత్రిక):** చిత్తూరు జిల్లా పలమనేరు అటవీ పరిధి సమీపంలో గల వికోట మండ లంలో తరచుగా పంటలపై ఏనుగుల దాడి మనకు తెలిసిన విషయమే. కొద్ది రోజులు రైతులు ప్రశాంతంగా తాము ఆరుగాలం పండించిన పంటలను పండించుకుం టున్న క్రమంలో మళ్లీ గజరాజులు అలజడి మొదలైంది. నాయకనేరి గ్రామంలోని జువేరియా సుల్తానా అనే రైతుకు చెందిన అరటి,వరి పంట పొలాలపై బుధవారం అర్ధ రాత్రి మూడు ఏనుగులు దాడి చేశాయి.దీంతో రైతులంతా ఉలిక్కిపడ్డారు. గురువారం నుంచి ఏనుగులు గ్రామాలకు వచ్చే అవకాశాలు ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని అటీవిశాఖ అధికారులు హెచ్చరించారు. ఏనుగుల దాడిలో దాదాపు రెండు లక్షల పంటను కోల్పోయామని తమని, నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని రైతు అధికారులను వేడుకున్నారు. పంట పొలాలను సందర్శించిన సంబంధిత అధికారులు నష్టపరిహారాన్ని అంచనావేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

# టీచర్ స్వామి కన్నన్కు డాక్టరేట్



**వి.కోట, మే 16(ఆంధ్ర పత్రిక):** చిత్తూరు జిల్లాలోని మండల కేంద్రమైన వీకోట బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్వామి కన్నన్కు ప్రముఖ ప్రసిద్ధ విశ్వవిద్యాలయం శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్ను ప్రధానం చేసింది. బాలుర ఉన్నత పాఠశాల సోషియల్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహి స్తున్న స్వామి కన్నన్ మారుమూల ప్రాంత పేద విద్యార్థులకు విద్యను అందించడం ద్వారా వారిలో నైపుణ్యాన్ని పెంపొందించి చైతన్యం తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారు.శ్రీ వెంకటేశ్వర విశ్విద్యాలయం నందు రాజ నీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగం లో 'ది రోల్ ఆఫ్ సర్వ శిక్షా అభి యాన్ ఇన్ ఇంప్రూవింగ్ క్వాలిటీ ఎడ్యుకేషన్: ఎ కేస్ స్టడీ ఇన్ చిత్తూర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ 'అనే అంశంపై పి హెచ్ డి గ్రంథం సమర్పించినందుకుగాను వర్సిటీ కణ్ణన్ కి డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈ పరిశోధన ఆచార్య బి.వి.మురళీధర్ పర్యవేక్షణలో కొనసాగిందనీ ఆయన తెలిపారు.కన్నన్ 2013 యస్.వి.యు.రీసెట్ నందు మొదటి ర్యాంకు సాధించి అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశో ధనా పత్రాలు, సదస్సులలో పాల్గొని పలువురు మేధావుల మన్ననలు పొందారు. కేంద్ర ప్రభుత్వం 2002 నుండి అమలు పరుస్తున్న సర్వ శిక్షా అభియాన్ ప్రోగ్రాం చిత్తూరు జిల్లా లో గుణాత్మక విద్యను వృద్ధి చేయడంలో దాని పాత్రపై సమగ్రమైన పరిశోధన చేసి కణ్ణన్ ప్రభుత్వానికి కొన్ని సలహాలు సూచనలు చేయడం జరిగింది. కన్నన్ చిత్తూరు జిల్లాలోని రామకుప్పం మండలం ఆరిమానిపెంట గ్రామం నందు నిరుపేద కుటుంబంలో పుట్టి ,నాలుగు మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేశారు. ఇతను పాఠశాల విద్య,అభివృద్ధి కార్య క్రమాలలో చురుగ్గా పాల్గొంటూ, చిత్తూరు జిల్లా పి ఆర్ టి యు ప్రధాన కార్యదర్శి గా,అనేక సనాజ సేవ కార్యక్రమాల్లో పాల్గొంటూ, అనేక మంది ఉపాధ్యాయులకు సేవలందిస్తున్నారు. ఇతనికి డాక్టరేట్ ప్రదానం చేయటం పట్ల పురప్రముఖులు, వికోట లయన్స్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

## అంబరాన్ని అంటిన
# సి.రంగయ్య పుట్టినరోజు సంబరాలు



**కర్నూలు, మే 16(ఆంధ్రపత్రిక):** ఎమ్మిగనూరు నియోజకవర్గం స్థానిక కుర్ణి కల్యాణమండపంలో జిల్లా అధ్యక్షులు మల్లేష్ వైస్ ప్రెసిడెంట్ పరమేష్ నరసప్ప మరియు యువదళం జిల్లా అధ్యక్షులు నల్లన్న జిల్లా నాయకులు బలరాం రాముడు మల్లి తారక్ రమేష్ సీనియర్ నాయకులు రాజోలుప్ప ఆధ్వర్యంలో సమతా సైనిక్ దళ్ రాయలసీమ అధ్యక్షులు సి.రంగయ్య పుట్టినరోజు వేడుకలు అంబరాన్ని అంటాయి. పుట్టినరోజు వేడుకలకు అభిమానులు వందలాదిగా తరలి వచ్చారు.యువత వివిధ రూపాల సేవలతో ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు.మహిళలు భారీగా తరలి రావడంతో వేడుకలు ప్రత్యేకత సంతరించుకున్నాయి.రంగయ్య పుట్టినరోజు సందర్భంగా రోగులకు బ్రేడ్లు పండ్లు పాలు అందించి శాశ్వత రోగులకు రక్తదానం చేశారు. అంతేకాక రంగయ్య గారి పేరు మీద అనాథలకు అన్నదానం చేసి యువత అభిమానం చాటుకున్నారు.మహిళలు గుమ్మడికాయలతో జిస్టి తీసి మా పేదింటి బిడ్డ మా పెద్దకొడుకు అని ఆనందబాష్పలతో కన్నీరు పెట్టుకున్నారు.వివిధ గ్రామాల నుండి వచ్చిన అన్ని కులాల మతాల అభిమానులు భారీ గజమాలలతో సన్మానించి అభిమానం చాటుకున్నారు.ఈ సందర్భంగా రంగయ్య గారు మాట్లాడుతూ నాపై చూపిస్తున్న ఈ అభిమానం ఈ జన్మకు చాలని మరు జన్మ ఉంటే మీ కడుపున పుడతా అని నా ప్రాణం మీకోసమే అని మీకు ఏ సమస్య వచ్చిన మీకు అండగా ఉంటానని రాష్ట్ర రాజకీయం నన్ను గుర్తించేలా ప్రోత్సాహం ఇచ్చి నన్ను కాపాడుకుంటూ నా వెంట ఉన్న నా యువదళంకి రుణపడి ఉంటా అని బాబాసాహెబ్ బాటలో నడుస్తూ అయన ఆశయం కోసమే నా జీవితం నా జాతి కోసం సర్వస్వం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను అని అన్నారు.అనంతరం అభిమానుల కోసం ఏర్పాటు చేసిన విందులో పాల్గొని ఇంటికి జాగ్రత్తగా వెళ్ళాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక స్వామి వారిని దర్శించుకున్న
# కమిషనర్ సునీల్



**తిరుమల, మే 16(ఆంధ్రపత్రిక) :** స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం శ్రీ స్వామి వారి దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టిఐ కమిషనర్ శ్రీ సునీల్, స్వామి వారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసిన దేవస్థానం ఈ.వో వెంకటేశు, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపర్డెంట్ కోదండపాణి, పంచాయతీ సెక్రటరీ సత్యం రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డివారి గురవారెడ్డికి సన్మానం
## రాష్ట్ర అధికార ప్రతినిధి



**శ్రీకాళహస్తి,మే 16 (ఆంధ్ర పత్రిక):** శ్రీకాళహస్తి నియోజకవర్గనికి చెందిన రెడ్డి వారి గురవారెడ్డి ఇటీవల రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా నియమించడంపై తొట్టంబేడు మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం రెడ్డివారి గురువారెడ్డికి తొట్టంబేడు మండల నాయకులు ఘనంగా దుస్సాల్వాతో పూల మాలలతో సత్కరించారు .నిరంతరం పార్టీ కోసం పనిచేసే పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసే ప్రతిపక్ష పార్టీ విరోచత పోరాటం చేస్తున్న రెడ్డివారి గురువారెడ్డికి రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించడంతో పార్టీ కార్యకర్తలుకు ఓ పెద్ద ఉత్సాహం ఇచ్చినట్లుగా భావిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ పార్టీ యూత్ అధికార ప్రతినిధి చెన్ను రాఘవలు యాదవ్, తొట్టంబేడు మండలంటి ఎన్ టి యు సి అధ్యక్షుడు, బీసీ నాయకుడు చింత గింజల సునీల్ కుమార్, పార్టీనాయకులు చంద్ర మహేష్ నాయుడు,బూత్ కమిటీ కన్వీనర్ తాతయ్య, వీరాంజనేయులు,గురాజీ, తదితరులు పాల్గొని సత్కరించడం జరిగింది.

# వైయస్సార్ నుండి కాపవరం సర్పంచ్ సస్పెండ్

**కోరుకొండ, మే 16 (ఆంధ్రపత్రిక) :** కోరుకొండ మండలం కాపవరం గ్రామ సర్పంచ్ జాజుల రాముని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తూర్పుగోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కంపూడి రాజా తెలియజేశారు.

కాపవరం సర్పంచ్ రాము పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ ఈనిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో జరిగిన పరిస్థితుల కారణంగా జిల్లా పార్టీ అధ్యక్షులు జక్కంపూడి రాజా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. ఎవరైనప్పటికీ, వైస్సార్ పార్టీలో ఉంటూ, వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు.

## తొత్తరమూడి పంచాయతీ కార్యాలయంలో
# తనిఖీ చేసిన బొజ్జి రాజు



**అమలాపురం,మే 16 (ఆంధ్రపత్రిక):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి డి. బొజ్జి రాజు అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామపంచాయతీ కార్యాలయమును తనిఖీ చేసినారు. కార్యాలయ సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్, కార్యాలయ రికార్డును తనిఖీ చేసినారు. సచివాలయ సిబ్బందిని, పంచాయతీ సిబ్బందిని సమావేశ పరసి కార్యాలయంలో మంచి క్రమశిక్షణతో ఉద్యోగ విధి నిర్వహణ చేస్తూ ,కార్యాలయం వచ్చిన వారికి గౌరవ మర్యాదలు ఇచ్చి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో "మానవసేవే మాధవసేవ" స్ఫూర్తిగా తీసుకొని సేవాభావంతో పనిచేయాలని తెలిపినారు. క్లాప్ మిత్రాల యొక్క ల ఇన్ యాక్టివిటీ మరియు ఔట్ ఆక్టివిటీ సరైన సమయంలో చేయాలని సూచించినారు. పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ళ రవి పంచాయతీ రికార్డ్ చూపించినారు. తొత్రరమూడి గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ళ రవి ,సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## సిబిఎస్ఈ ఫలితాల్లో సత్తా చాటిన
# వివేకానంద మిలీనియం స్కూల్ విద్యార్థులు







**హిందూపురం, మే 16 (ఆంధ్రపత్రిక):** ఇటీవల ప్రకటించిన సిబిఎస్ఈ 10వ తరగతి పరీక్షల్లో వివేకా నంద మిలీనియం స్కూల్ విద్యార్థులు చరిత్ర సృష్టించారు. వివేకానంద మిలీనియం స్కూల్ నుంచి జిల్లా టాపర్లుగా బిఎస్ ఆత్రేయ 485/500 స్కోర్ చేశాడు. హిందూపూర్ ప్రైవేట్ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోర్డు పరీక్షల చరిత్రలో ఇదే తొలిసారి. 26 మంది విద్యార్థులు డిస్టింక్షన్, ఫస్ట్ క్లాస్ సాధిం చి 100% ఉత్తీర్ణత శాతం సాధించారు. విద్యార్థులందరినీ కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, ప్రిన్సిపాల్ హరీష్, అడ్మిన్ ఐశ్వర్య, ఉపాధ్యాయులు అభినందించారు. ఫలితాలపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ యాజమా న్యానికి, ప్రిన్సిపాల్కి, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రైలు పట్టాలపై
# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**కుప్పం,మే 16 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం స్థానిక కుప్పం పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్య మైన ఘటన గురువారం వెలుగు చూసింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి శరీర భాగాలు వేరువేరుగా పడి ఉంది. కాగా వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా?లేక ఎవరైనా హతమార్చి రైలు పట్టాల పై పడేసారా అనేఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా వివరాలు రైల్వే పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. అయితే ప్రాథమిక సమాచారాన్ని బట్టి శాంతిపురం మండల అభివృద్ధి కార్యాలయం లో ఆఫీసు ఉద్యోగి నరేంద్ర మూర్తి గా గుర్తింపు ఇంకా పూర్తివిషయాలు తెలియాల్సి ఉంది.

# ఫోటోగ్రఫీ ఓ అద్భుత శక్తి..



- ఒకే ఒక్క ఛాయాచిత్రంలో సమాచారం మొత్తం యిమిడి ఉంటుంది.....
- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో సమాచార శాఖ పనితీరు కీలకం
- జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

**విజయవాడ, మే 16 (ఆంధ్రపత్రిక):**ఫోటోలు లేని న్యూస్ పేపర్ వెలుగు ఇవ్వని దివిటీ లాంటిదని ఒకే ఒక చాయచిత్రం వేయి పదాల అర్థాన్నిస్తుందని ఫోటో జర్నలిస్టు తీసిన చిత్రం ప్రచరించబడి ఎన్నో జీవితాలలో మార్పు తీసుకువచ్చిన సంఘటనలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జిల్లా సమాచార శాఖకు మంజూరు చేసిన నికొాన్ డీ850 మోడల్ కెమెరాను గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆయన కార్యాలయంలో సమాచార శాఖ అధికారులకు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం ఒక ఫోటోతో ఎన్నో భావాలను బాహ్య ప్రపంచానికి తెలియజేసే అద్భుత శక్తి ఒక్క ఫోటోగ్రఫీకే ఉంటుందన్నారు. మానవ జీవితానికి ఫోటోగ్రఫీకి అవినాభావ సంబంధం ఉంటుందన్నారు. కాలగర్భంలో కలిసిపోయే ఎన్నో మధుర స్మృతులను పదిలంగా ఉంచగల శక్తి ఫోటోలకే ఉంటుందన్నారు. ప్రజల ఆలోచన సరళికి పదునుపెట్టి ఓర్పు, నేర్పుతో తీసిన ఫోటోలు పత్రికలో ప్రచురించడంద్వారా ఎన్నో జీవితాలలో వెలుగులు నింపిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయడంలో ప్రధాన భూమిక పోషించే సమాచార శాఖలో ఫోటోగ్రఫి పాత్ర కీలకం అన్నారు. అత్యంత ప్రముఖులు, ఉన్నతాదికారుల పర్యటనలు, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు మీడియాకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూధికారి వి.శ్రీనివాసరావు జిల్లాసమాచార పౌర సంబంధాల అధికారి యు సురేంద్రనాద్, డిపిఆర్వో ఎస్.వి.మోహన్ రావు, పబ్లిసిటీ అసిస్టెంట్ వి.వి ప్రసాద్ ఫోటోగ్రాఫర్ ఎం.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరి



**విజయవాడ, మే 16 (ఆంధ్రపత్రిక):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత రాజకీయ పార్టీలు నేతలందరూ ఎవరికి వారు కాస్త రిలీఫ్ అవ్వాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటనకు ప్లాన్ చేసుకున్నారు. ఈ మేరకు తన పర్యటనకు సంబంధించి సిబిఐ అనుమతి కూడా తీసుకున్నారు. సీఎం జగన్ మే 17 నుండి జూన్ 1 వరకు ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లో కుటుంబ సమేతంగా పర్యటించనున్నారు. పవన్ కళ్యాణ్ సైతం భార్య అన్నా లెజ్నేవాతో కలిసి విదేశాలకు వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు. ఇక టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల పోలింగ్ ముగిసిన క్రమంలో పుణ్యక్షేత్రాల బాట పట్టారు. చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరితో కలిసి ప్రస్తుతం పుణ్యక్షేత్రాల సందర్శన చేస్తున్నారు. నేడు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీసమేతంగా మహారాష్ట్రలో పర్యటిస్తున్నారు. చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు నేడు కొల్హాపూర్‌లోని శ్రీ మహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు చంద్రబాబు దంపతులకు ఆశీర్వచనం ఇచ్చి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. గతానికి భిన్నంగా చంద్రబాబు ఇటీవల కాలంలో ఎక్కువ ఎక్కువగా పూజలు పునస్కారాలపైన ధ్యాస పెట్టినట్టుగా కనిపిస్తుంది.

## పెద్దశేష వాహనంపై గోవిందుడి వైభవం



**తిరుమల, మే 16(ఆంధ్రపత్రిక):**తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు గురువారం రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామి భక్తులను కటాక్షించారు. అశ్వాలు, వృషభాలు, గజాలుముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్కభజనల నడుమ స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని సేవించుకున్నారు. శేషుడు స్వామివారికి మంచం, పరుపు, ఛత్రం మూడూ తానే అయి శేషశాయి అనే పేరును సార్థకం చేస్తున్నారు. శేషుణ్ణి దర్శించే భక్తుల్ని కాపాడుతానని, మీరందరూ శేషుని వలె నాకు నిత్యసేవకులుగా ఉండి సత్ఫలితాలు పొందాలని ఈ వాహనసేవ ద్వారా స్వామివారు బోధిస్తున్నారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, ఆలయ డెప్యూటీ ఇఓ శాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





## మీరు చూపిన ప్రేమ, ఆప్యాయత మరువలేనిది

- పిఠాపురంలో అక్కున చేర్చుకున్నందుకు ఆనందం
- ఎపి ప్రజలకు కృతజ్ఞత తెలుపుతూ పవన్ లేఖ



**అమరావతి, మే 16 (ఆంధ్రపత్రిక):**ఏపీ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఓ లేఖను విడుదల చేశారు. 'ప్రియమైన ఏపీ ప్రజలకు నమస్కారం.. ఈనెల 13న జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో మీరు చూపించిన ప్రేమకు మనస్ఫూర్తిగా హృదయపూర్వక కృతజ్ఞతలు. సుస్థిర ప్రభుత్వం, సంక్షేమం, అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఈ ఎన్నికల్లో పెద్ద ఎత్తున భాగస్వాములైనందుకు నా అభినందనలు. అత్యధికంగా 81.86శాతం మంది ఓట్లు వేసి రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవడం చాలా ఆనందం కలిగించింది. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల సంఘం అధికారులు, అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలను ప్రత్యేకంగా అభినందిస్తున్నా. అలాగే, ఎన్నికల ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా, పౌర సంఘాలు పోషించిన బాధ్యతాయుతమైన పాత్రకు కృతజ్ఞతలు' అని లేఖలో పేర్కొన్నారు. పిఠాపురం ప్రజలకు పవన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పిఠాపురం అభ్యర్థిగా పోటీ చేసిన తనను ఆదరించి అండగా నిలిచి ప్రజలు చూపించిన ప్రేమకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తాను పోటీ చేస్తున్నట్లు తెలియగానే ఎంతో బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ తన సీటు త్యాగం చేసి సంపూర్ణ మద్దతు ప్రకటించిన పిఠాపురం తెదేపా ఇంఛార్జి ఎస్.వి.ఎస్. ఎన్.వర్మ, ఆయన అనుచరులకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ ఎన్నికల్లో వర్మ అందించిన సహకారం మరువలేనిదన్నారు. భవిష్యత్తులో ఖచ్చితంగా ఆయన చట్టసభల్లో అడుగుపెట్టి ప్రజల తరపున బలంగా పని చేస్తారని విశ్వసిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు. అలాగే రానున్న రోజుల్లో పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం వర్మ అనుభవాన్ని వినియోగించుకుంటూ కలిసికట్టుగా ముందుకు వెళ్తామన్నారు. పిఠాపురంలో నేను పోటీచేస్తున్నానని తెలియగానే అండగా ఉండేందుకు తమ సినిమాలు, ధారావాహికలకు విరామం ఇచ్చి ముందుకు వచ్చి పిఠాపురంలో ప్రతీ గడపకు వెళ్లి ప్రచారం చేసిన సినీ, బుల్లితెర నటీనటుల ప్రేమ నన్ను కదిలించింది. నా విజయాన్ని కాంక్షిస్తూ ఎంతోమంది అగ్ర కథానాయకుల నుంచి, నవతరం నటుల వరకు అందరూ మద్దతు ప్రకటించడం సంతోషాన్నిచ్చింది. ప్రతీ ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అలాగే దేశ విదేశాల నుంచి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తరలివచ్చి తమ మాతృభూమి అభివృద్ధి ఆకాంక్షను వెల్లడిరచిన ఎన్నారై జనసైనికులకు నా అభినందనలు. పిఠాపురంలో మార్పు కోసం మార్పునకు ముందడుగు వేసేందుకు పనిచేసిన ప్రతీ ఒక్క నాయకుడికి, జనసైనికుడికి, వీరమహిళలకు, తెదేపా, భాజపా నాయకులు, కార్యకర్తలకు, పౌర సమాజానికి ధన్యవాదాలు తెలుపుతున్నా. రానున్న రోజుల్లో అందరినీ కలుపుకొంటూ పిఠాపురం నియోజకవర్గాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని మాటిస్తున్నానని లేఖలో పేర్కొన్నారు.

## నిందతో వస్తున్న వరుణ్ సందేశ్



కాంద్రకోట మిస్టరీ అంటూ యథార్థ సంఘటనల నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం 'నింద'లో వరుణ్ సందేశ్ హీరోగా నటించారు. ఈ మూవీని రాజేష్ జగన్నాథం నిర్మించడమే కాకుండా కథ, కథనాన్ని రాసి దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్, ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందనను రాబట్టుకోగా.. తాజాగా ఈ మూవీ టీజర్‌ను విలక్షణ నటుడు నవీన్ చంద్ర చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. ఇటీవల జరిగిన దాదా సాహెబ్ ఫాల్కే ఫెస్టివల్ అవార్డ్స్‌లో అవార్డును అందుకున్న నవీన్ చంద్ర టీజర్ విడుదల చేసిన అనంతరం చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. టీజర్ బాగుందని టీంను మెచ్చుకున్నారు. సినిమా మంచి విజయం సాధించి టీమ్ అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరారు. టీజర్ విషయానికి వస్తే.. 'జీవితంలో కొన్ని సార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు'. అనే డైలాగ్‌తో మొదలైన ఈ టీజర్‌లో ఎన్నో కోణాలున్నాయి. అందమైన ప్రేమ కథ కనిపిస్తోంది. దాంతో పాటుగా మర్డర్, క్రైమ్ మిస్టరీ కూడా ఉన్నట్టుగా తెలుస్తోంది. అలాగే టీజర్‌లోని విజువల్స్ కూడా ఎంతో న్యాచురల్ గా ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఆర్ఆర్ అయితే మూడ్‌కు తగ్గట్టుగా సాగింది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను ఫీల్ అయ్యేలా నేపథ్య సంగీతం సాగింది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని.. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామని దర్శకనిర్మాత తెలిపారు.

## మళ్లీ వాయిదా...



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' విడుదలకు వరుసగా అవాంతరాలు ఎదురవుతున్నాయి. గత ఏడాది చివర్లోనే కంగనా రనౌత్ తన ఎమర్జెన్సీ సినిమాను విడుదల చేయాలని భావించింది. కానీ అప్పటికి షూటింగ్ పూర్తి అవ్వక పోవడంతో పాటు, కొన్ని ఇతర కారణాల వల్ల సినిమాను ఈ ఏడాది జూన్‌కు వాయిదా వేశారు. ఇప్పటికే సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చింది అంటూ కొన్ని నెలల క్రితమే కంగనాతో పాటు ఇతర యూనిట్ సభ్యులు ప్రకటించారు. కానీ జూన్‌లో కూడా సినిమా విడుదల అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. కంగనా ప్రస్తుతం ఎన్నికల హడావుడిలో ఉంది. ఆమె హిమాచల్ ప్రదేశ్ నుంచి ఎంపీగా బరిలో నిలుస్తున్న నేపథ్యంలో ప్రచారానికి ఎక్కువ సమయం కేటాయిస్తుంది. రాజకీయాలతో బిజీగా ఉన్న కారణంగానే ఇప్పటికే షూటింగ్ పూర్తి చేయాల్సిన ఎమర్జెన్సీని కంగనా పూర్తి చేయలేదు. అందుకే ఎమర్జెన్సీ సినిమా మళ్లీ వాయిదా వేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు.

## త్యాగాలు చేయాలి



'జీవితంతో కొన్ని సాధించాలంటే కొన్ని త్యాగాలు చేయాలి, సవాళ్లను ఎదుర్కొవాలి, అలాగే అభిమానులు, ప్రేక్షకులను మెప్పించాలంటే కథానాయికగా బలమైన కథలు ఎంచుకోవాలి. వాటితో ప్రేక్షకులను మెప్పించాలి. అందుకోసం చాలా కష్టపడాలి' అంటున్నారు బాలీవుడ్ యువకథానాయిక జాన్వీకపూర్. 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రం కోసం ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. రాజ్‌కుమార్ రావ్‌తో కలిసి ఆమె నటించిన చిత్రమిది. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కింది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో షూటింగ్ టైమ్‌లో ఎదుర్కొన్న సవాళ్లను గురించి చెప్పుకొచ్చింది. ఈ సినిమా కోసం రేయింబవళ్లు కష్టపడి క్రికెట్ నేర్చుకున్నాను. క్రికెట్ నేపథ్యంలో కథ కాబట్టి నేను తప్పక క్రికెట్ నేర్చుకోవాలని పట్టుబట్టారు. ఎలాంటి వీఎఫ్ఎక్స్ ఉపయోగించకూడదన్నారు. శిక్షణ సమయంలో ఎన్నో దెబ్బలు తగిలాయి. భుజాలు డిస్‌లొకేట్ అయ్యాయి. ఈ చిత్రాన్ని వదిలేద్దామని అనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ సినిమాకు కూడా ఆ అదృష్టం కలిసిరావాలని ఆశిస్తున్నా' అని చెప్పారు. జాన్వీ. ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది.

## ట్రైలర్ రిలీజ్ కోసం ఏర్పాట్లు



కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భారతీయుడు 2' వీళ్లిద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన హిట్ సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా ఇది రానుంది. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మూడో భాగంపై కూడా వార్తలు వస్తుండడంతో సినీప్రియులు సంబరపడుతున్నారు. 'భారతీయుడు 2'తో పాటే మూడో భాగాన్ని కూడా సిద్ధం చేస్తున్నట్లు టీమ్ ఇప్పటికే ప్రకటిం చిన సంగతి తెలిసిందే. పార్ట్ 3కు సంబంధించిన షూటింగ్‌ను కూడా శంకర్ కంప్లీట్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ రెండు సినిమాలను ఏడాదిలోపే విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. 'భారతీయుడు 2' ట్రైలర్ రిలీజ్ కోసం యూనిట్ ఓ భారీ ఈవెంట్‌ను ప్లాన్ చేస్తోందట. ఇప్పటికే పనులు పూర్తయినట్లు టాక్. జూన్‌లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం గతం లోనే తెలిపింది. జూన్‌కు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కష్టమని అందుకే దీన్ని జులై 12కు వాయిదా వేసినట్లు టాక్ వినిపిస్తుంది. అన్నిటి కంటే ముఖ్యంగా ఈ మూవీ టీమ్ భారీ సర్‌ప్రైజ్‌కు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. పార్ట్2 క్లైమాక్స్‌లోనే మూడో భాగం ట్రైలర్‌ను ప్రదర్శించాలని చూస్తోందట. దానితో పాటే పార్ట్-3 విడుదల తేదీని కూడా ప్రకటించ నున్నట్లు తెలుస్తోంది. 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచల నం సృష్టించింది 'భారతీయుడు'. సేనాపతి పాత్రలో కమల్ ఆహార్యం, హావభావాలు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' మరో సారి మ్యాజిక్ చేసేందుకు సిద్ధమైంది. ఇది విడుదలైన వెంటనే మూడో భాగానికి సంబంధించిన నిర్మాణాంతర పనుల్ని మొదలు పెట్టనున్నారు.

## గాయంతోనే కేన్స్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యాయ్

అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఫ్రాన్స్‌లో జరిగే కేన్స్‌కు ప్రత్యేకత ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఎందరో సినీ తారలు ఈ కార్యక్రమంలో పాల్గొని రెడ్ కార్పెట్‌పై సందడి చేస్తుంటారు. ఈ కేన్స్ వేడుకల్లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. విభిన్న కాస్ట్యూమ్స్‌తో అలరిస్తుంటుంది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు కొత్త కళ తెస్తుంటుంది ఐశ్వర్య. ఆమె రెడ్ కార్పెట్‌పై అలా నడుచుకూంటూ వస్తుంటే కెమెరా కళ్లన్నీ ఐష్ వైపే ఉంటాయి. అయితే, ఈ సారి ఆమె గాయంతోనే కేన్స్‌లో పాల్గొనబోతోంది. గాయం కారణంగా చేతికి కట్టుతోనే కుమార్తెతో కలిసి ఐశ్వర్య ఫ్రాన్స్‌కు పయనమైంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఫ్రాన్స్ వేదికగా ఏటా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతుందన్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన సినీ తారలు, మోడళ్లు, డిజైనర్లు, పలువురు సెలబ్రిటీలు ఈ వేడుకలో పాల్గొని విభిన్న ఫ్యాషన్ దుస్తుల్లో రెడ్ కార్పెట్ పై హొయలుపోతుంటారు. బాలీవుడ్ నుంచి కూడా పలువురు తారలు హాజరై ట్రెండీ దుస్తులు ధరించి అందరినీ ఆకర్షిస్తుంటారు. ఇక ఏటా ఐశ్వర్య ఈ వేడుకలకు కచ్చితంగా హాజరవుతుంటుంది. కొత్త కొత్త కాస్ట్యూమ్స్ ధరించి తళుక్కున మెరిసి ఆకట్టుకుంటుంటుంది.



## ఎన్నికల అనంతరం హింసపై చర్యలు తీసుకోండి



**విజయవాడ, మే 16 (ఆంధ్రపత్రిక):**సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత చోటు చేసుకున్న అల్లర్లు, దాడులు వెనుక ఉన్న బాధ్యులపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని వైసీపీ నేతలు గవర్నర్‌ను కోరారు. రాజ్‌భవన్‌కు వెళ్లిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల బృందం గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో పోలింగ్ అనంతరం చెలరేగిన హింసపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలు, మంత్రులు ఈ బృందంలో మంత్రి బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, మాజీ మంత్రి పేర్ని నాని, మోపిదేవి వెంకటరమణ, కావటి మనోహర్ నాయుడు తదితరులున్నారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పోలింగ్ తర్వాత జరుగుతున్న హింస ఆందోళన రేపుతోంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న పోలీసుల పనితీరుపై ఫిర్యాదు చేశాం. అబ్జర్వర్ దీపక్ మిశ్రా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ వాళ్లు ఫిర్యాదు చేస్తే విచారణ లేకుండా చర్యలు తీసుకున్నారు. అబర్వర్‌గా ఉన్న దీపక్ మిశ్రాపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని కల సంఘం నుంచి రిపోర్ట్ తెచ్చుకుని దీపక్ మిశ్రాను మార్చాలని గవర్నర్‌ను కోరినట్టు వెల్లడించారు మంత్రి బొత్స సత్యనారాయణ ఇక, పల్నాడు ఎస్పీ, ఐజీ త్రిపాఠి వంటి కొందరు అధికారులు ఎన్నికల వేల పచ్చ చొక్కాలు వేసుకున్నారు అంటూ విమర్శలు గుప్పించారు. మంత్రి మేరుగ నాగార్జున రాయలసీమ, పల్నాడులో పోలీసులను మార్చాలని కోరాం కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో దీపక్ మిశ్రాను మార్చి దేశంలో ఏ అధికారి అయినా పర్లేదు అని గవర్న ర్‌ను కోరాం అన్నారు. మరోవైపు ఎంపీ మోపిదేవి వెంకట రమణ మాట్లాడుతూ దీపక్ మిశ్రా వల్లే ఈ విధ్వంసం జరిగిందని మండిప డ్డారు. పోలీసుల పక్షపాత ధోరణి వల్లే ఈ హింస జరుగుతోంద న్నారు. దీపక్ మిశ్రా కనుసన్నల్లో పోలీసులు ఉన్న చోట ఈ హింస జరుగుతుందన్న ఆయన ప్రశాంతంగా ఉన్న ఏపీలో ఇలాంటి పరిస్థి తులు రావటానికి కారణం దీపక్ మిశ్రా అతడిపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరామని ఎంపీ మోపిదేవి పేర్కొన్నారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh,
and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com